మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 11-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 74 Issue: 74

11 సెప్టెంబర్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:18 తిథి అమావాస్య ఉ. 8:58 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) మ. 1:15 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం సాధ్య సా. 4:58 వరకు కరణం నాగవ ఉ. 8:58 వరకు స్తుష్ణమ రా. 8:21 వరకు వర్జ్యం రా. 8:22 నుండి రా. 9:57 వరకు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:22 వరకు మ. 12:37 నుండి మ. 1:25 వరకు రాహుకాలం ఉ. 10:41 నుండి మ. 12:12 వరకు యమగండం మ. 3:15 నుండి సా. 4:46 వరకు గుళికాకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:09 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు ఉ. 7:03 నుండి ఉ. 8:36 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:37 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## మాజీ భార్యకు రూ.18 వేల కోట్ల భరణం

దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ గేమింగ్ కంపెనీ స్మైల్‌గేట్ వ్యవస్థాపకుడు క్వాన్ హ్యూక్-బిన్‌కు సంబంధించిన కేసులో కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. క్వాన్ హ్యూక్-బిన్.. తన మాజీ భార్య లీ హ్యే-జిన్‌కు 2.55 ట్రిలియన్ వాన్ విలువైన ఆస్తులను ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

సియోల్:ఇది భారత కరెన్సీలో సుమారు రూ.18 వేలకోట్లు. దీంతో ఇది దక్షిణ కొరియా చరిత్రలో అతిపెద్ద విడాకుల సెటిల్‌మెంట్‌గా నిలిచింది. గతంలో దక్షిణ కొరియా టెక్ దిగ్గజం చెయ్ టే-వోన్ తన మాజీ భార్యకు 944 బిలియన్ వాన్ చెల్లించాలని కోర్టు ఆదేశించింది. క్వాన్ హ్యూక్-బిన్ దక్షిణ కొరియాలోని ప్రముఖ బిలియనీర్‌లలో -2 వ పేజీలో...



## కార్గో నౌకలో 20 మంది దగ్ధం

చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం

మరో ఐదుగురు గల్లంతు




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,551 |
| వెండి (కిలో): | రూ.2.,55,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,760 |

### విశ్వవాణి



రాత్రిపూట 8 గంటలు నిద్రపోయినా ఉదయం అలసటగా అనిపిస్తుందా? అందుకు కెఫిన్ కారణం కావచ్చని తాజా పరిశోధన వెల్లడించింది. పలు అధ్యయనాలను విశ్లేషించిన శాస్త్రవేత్తలు.. కెఫిన్ నిద్ర నాణ్యతను దెబ్బతీస్తుందని గుర్తించారు. కెఫిన్ మెదడులో నిద్రమత్తును కలిగించే అడెనోసిన్ అనే రసాయనాన్ని అడ్డుకుంటుంది. దీంతో మెలకువ పెరుగుతుంది. అయితే నిద్రలోకి వెళ్లిన తర్వాత కూడా మెదడు కార్యకలాపాలపై దీని ప్రభావం కొనసాగుతుందట.

# సోషల్ మీడియాలో బూతులు

## పిల్లల్ని రక్షించండి: సుప్రీం కోర్టు

ఆన్‌లైన్ వేదికలపై పిల్లల భద్రతపై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. సోషల్ మీడియా, ఇతర డిజిటల్ వేదికలపై లైంగిక వేధింపులు, అనుచిత కంటెంట్ నుంచి పిల్లల్ని రక్షించేందుకు బలమైన భద్రతా చర్యలు కోరుతూ ఓ స్వచ్ఛంద సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది.

న్యూఢిల్లీ: పిల్లల భద్రత కోసం డిజిటల్ వేదికలపై ఫైర్‌వాల్స్ చాలా అవసరం అని ధర్మాసనం తెలిపింది. అంతేకాదు భారతదేశంలో పిల్లల కోసం కొన్ని బలమైన రక్షణ చర్యలు ఉండాలని అభిప్రాయపడింది. ఈ మేరకు వివరణ కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. సోషల్ మీడియా, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌ను ఉపయోగిస్తున్నప్పుడు మైనర్లకు తగిన రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది. ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ వంటి సంస్థలు 13 ఏళ్ల నుంచే ఖాతాలు తెరవడానికి అనుమతిస్తున్నాయని కోర్టు దృష్టికి తరువాయి 2 వ పేజీలో...





# రెట్రో.. జర కంట్రోల్!

## 1980ల్లోకి తీసుకెళ్తామంటూ మోసగాళ్ల వల

ఒకప్పుడు నలుపు-తెలుపు ఫొటోలు.. పాతకాలపు దుస్తులు.. 1980ల నాటి రూపురేఖలు.. ఇప్పుడు అవే మళ్లీ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. కృత్రిమ మేధతో పాతకాలపు రూపాన్ని సృష్టించుకోవాలన్న ఆసక్తి ఒక్కసారిగా పెరిగిపోయింది. సామాన్యుడి నుంచి ప్రధాని వరకు.. అంతా ఈ మోజులో పడిపోయారు. 'రెట్రో లుక్' అంటూ తమ ఫొటోలను 1980ల నాటి రూపంలోకి మార్చుకుంటూ పలువురు నెటిజన్లు సందడి చేస్తున్నారు. వినోదాత్మకంగా కనిపిస్తున్న ఈ ట్రెండ్ వెనుక పెను ప్రమాదం పొంచి ఉందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

'పాతకాలం'తో వ్యక్తిగత సమాచారానికి ఎసరు

ఏపీకే ఫైల్స్ పంపి బ్యాంకు అకౌంట్ల డబ్బు చోరీ

వినోదం కంటే.. విచక్షణ ముఖ్యం: సైబర్ నిపుణులు

(ఈవార్తలు - స్పెషల్ డెస్క్)

'మీ ఫొటోను 1980ల రెట్రో లుక్‌లోకి మార్చుకోండి', 'ఉచితంగా రెట్రో ఫొటో తయారు చేసుకోండి', 'ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ చేసుకోండి' అంటూ సైబర్ నేరగాళ్లు నకిలీ ప్రకటనలు, సందేశాలు, వెబ్‌సైట్ లింకులను ప్రచారం చేసే అవకాశం ఉంది. ఆసక్తితో లింకుపై క్లిక్ చేసి అపరిచిత అనువర్తనాలను ఇన్‌స్టాల్ చేస్తే.. మొబైల్‌లోని వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, పరిచయ వివరాలు, సందేశాలు, ఇతర సున్నితమైన సమాచారాన్ని నేరగాళ్లు తస్కరించే ప్రమాదం ఉంటుంది. నెటిజన్ల ఆసక్తిని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరతీశారు. మీ ఫొటోలను రెట్రో లుక్‌లోకి మార్చుకోండి -2 వ పేజీలో...



# త్వరలో 6 డీఏలు ప్రకటిస్తా

## ఉద్యోగులకు అండగా ఉంటా.. జేఏసీతో చర్చల్లో సీఎం హామీ



ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు. పీఆర్సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో -2 వ పేజీలో...



# కేటీఆర్, హరీశ్ లైంగిక వేధింపులు!

## అసెంబ్లీ వద్ద చొక్కాలు విప్పి ఇబ్బంది పెట్టారు

### మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు.. కేసు నమోదు

అసెంబ్లీ వద్ద విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు సహా నలుగురు నేతలపై పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): వివరాల్లోకి వెళితే.. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేట్ నెం.3 వద్ద మహిళా కానిస్టేబుళ్లు భద్రతా విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో రాజకీయ నినాదాలున్న నల్ల టీ-షర్టులు ధరించి, ప్లకార్డులతో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు అక్కడికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం అలాంటి దుస్తులు, వస్తువులకు అనుమతి లేదని పోలీసులు చెప్పగా, బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ తన తరువాయి 2 వ పేజీలో...

# నినాదాలు.. నిరసన పాటలు

## మండలిలో '22ఏ'పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వాయిదా తీర్మానం

### ప్రశ్నోత్తరాల సమయంలో చర్చకు పట్టు.. తిరస్కరించిన చైర్మన్

### నిరసనగా వాకౌట్ చేసిన బీఆర్ఎస్ సభ్యులు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు, నిరసన పాటలతో గురువారం మండలిలో గందరగోళం తలెత్తింది. నిషేధిత భూముల '22ఏ' అంశంపై చర్చకు వాయిదా తీర్మానం ఇచ్చిన విపక్ష సభ్యులు.. చర్చకు పట్టుబట్టారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఈ వాయిదా తీర్మానాన్ని అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పోడియం వైపు దూసుకొచ్చి నినాదాలు, నిరసన పాటలతో హోరెత్తించారు. తీర్మానం తిరస్కరిస్తున్నట్టు చైర్మన్ ప్రకటించడంతో నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. గురువారం మండలి ప్రారంభమైన వెంటనే చైర్మన్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. అయితే 22ఏ అంశంపై ఇచ్చిన వాయిదా తీర్మానం చర్చకు తరువాయి 2 వ పేజీలో...



# రేవంత్ 18 గంటల పని.. సోదరుల కోసమే!

### నిబంధనలకు విరుద్ధంగా కొండల్ రెడ్డికి రూ.200 కోట్ల భూమి

### ఈ భూ కుంభకోణంపై ఈడీ, సీబీఐతో విచారణ చేపట్టాలి: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆ వివాదాస్పద భూ కేటాయింపు స్థలాన్ని తరువాయి 2 వ పేజీలో...



# సెక్రటేరియట్‌లోనే లంచం!

### ఏసీబీ చేతికి చిక్కిన ఉద్యోగి

### సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం లంచం డిమాండ్

### రూ.లక్ష తీసుకుంటూ చిక్కిన డీటీపీ ఆపరేటర్

# కొండగట్టు పనులకు మోక్షం

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి టీటీడీ నిధుల అంశం

### పనులకు రేవంత్ గ్రీన్ సిగ్నల్.. ఎమ్మెల్యే సత్యం ప్రత్యేక చొరవ

కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి భక్తులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. కొండగట్టులో రూ.35.19 కోట్లతో చేపట్టనున్న దీక్షా విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. ఈ మేరకు చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఈ పనుల విషయమై ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.



మల్యాల/హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): స్పందించిన ముఖ్యమంత్రి పెండింగ్‌లో ఉన్న పనులను ముందుకు తీసుకెళ్లేందుకు సానుకూలంగా నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తరువాయి 2 వ పేజీలో...



# '60 రోజుల డెడ్‌లైన్' రద్దు!

### జాబ్ పోతే అమెరికాను వీడాల్సిందే

### ముసాయిదా ప్రతిపాదన విడుదల

### భారతీయ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం

వాషింగ్టన్: విదేశీ ఉద్యోగులపై ట్రంప్ సర్కార్ మరో పిడుగు వేసింది. ఉపాధి ముగిసిన తర్వాత హెచ్1బీ, ఎల్1 వీసాదారులు వంటి నిర్దిష్ట వలసేతర ఉద్యోగులకు(నాన్ ఇమిగ్రెంట్) ప్రస్తుతం లభిస్తున్న 60 రోజులు -2 వ పేజీలో...



# ఒక్క రోజే శ్రీవారికి రూ.6.93 కోట్ల ఆదాయం

తిరుమల, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఆల్‌టైమ్ రికార్డు నమోదైంది. గురువారం ఒక్కరోజే శ్రీవారి హుండీ ద్వారా ఏకంగా రూ. 6.93 కోట్ల ఆదాయం సమకూరినట్లు టీటీడీ వర్గాలు తెలిపాయి. తిరుమల క్షేత్ర చరిత్రలో ఇప్పటివరకు రోజువారీ హుండీ ఆదాయం రూ. 6 కోట్ల మార్కును దాటడం ఇది నాలుగోసారి మాత్రమే. గతంలో తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

11.9.2026

మేషం: విద్యార్థులకు అనుకూల ఫలితాలు ఉంటాయి. సన్నిహితుల నుంచి అవసరానికి ధనసహాయం అందుతుంది. ఉద్యోగ, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారములలో విజయం సాధిస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి.

వృషభం: ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకం ఉ ంటుంది. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వ్యాపారాలు విస్తరిస్తారు.

మిధునం: ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచివి కాదు. చిన్ననాటి మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. దూరప్రయాణాలు వాయిదా పడతాయి. వృత్తి ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. శుభకార్యాలకు ధన వ్యయం చేస్తారు. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడులు పెరుగుతాయి.

కర్కాటకం: చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం ఉండదు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపారమునకు సకాలంలో పెట్టుబడులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. కుటుంబ బాధ్యతలు మరింత పెరుగుతాయి.

సింహం: సంఘంలో విశేష గౌరవ మర్యాదలు పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. విలువైన వస్తు వాహన లాభాలు అందుతాయి. వ్యాపార, ఉ ద్యోగాలలో సొంత నిర్ణయాలతో ముందుకు సాగుతారు. రావలసిన సొమ్ము సకాలంలో అందుతుంది. వ్యాపార వ్యవహారాలలో అనుకూలత పెరుగుతుంది.

కన్య: వ్యాపార, ఉద్యోగాలు సజావుగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాదిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు లాభిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ సేవలకు తగిన గుర్తింపు అందుతుంది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు.

తుల: ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు వలన మానసిక సమస్యలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు మందగిస్తాయి. ఇంటాబయట చికాకులు తప్పవు. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది.

వృశ్చికం: ఆలయాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. ఇంటాబయట బాధ్యతలు మరింతగా పెరుగుతాయి. వ్యాపార, ఉ ద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. ధన వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు తప్పవు.

ధనస్సు: భూ వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ ప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగ, వ్యాపారాలలో ఆశించిన పురోగతి కలుగుతుంది. విద్యార్థులకు శుభవార్తలు అందుతాయి. సంఘంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. సోదరులతో వివాదాలు రాజీ చేసుకుంటారు.

మకరం: ఆరోగ్యం మందగిస్తుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు ఉంటాయి.

కుంభం: నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. వ్యాపార విస్తరణకు తీసుకున్న నిర్ణయాలు కలసి వస్తాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. చేపట్టిన పనులు సజావుగా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి.

మీనం: కొన్ని పనులలో శ్రమ తప్పదు. దూర ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. సేవా కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి. వ్యాపారాలలో నష్ట సూచనలు ఉన్నవి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. దాయదులతో ఆస్తి వివాదాలు చికాకు పరుస్తాయి.

# రెట్రో.. జర కంట్రోల్!

మొదటి పేజీ తరువాయి

అంటూ వచ్చే లింకులు, నకిలీ యాప్‌ల ముసుగులో వ్యక్తిగత సమాచారాన్ని దర్జాగా చోరీ చేస్తున్నారు.

**'రెట్రో' పేరుతో కొత్త వల**

ప్రజల ఆసక్తిని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకోవడం కొత్తేమీ కాదు. ఏ అంశం ప్రజల్లో ఎక్కువగా ఆదరణ పొందుతుందో.. దానినే మోసాలకు అస్త్రంగా ఉ పయోగిస్తారు. ప్రస్తుతం రెట్రో ఫొటోలపై పెరుగుతున్న ఆసక్తిని కూడా అదే విధంగా ఉ పయోగించుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా అధికారిక దుకాణాల వెలుపల నుంచి ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయించడం, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయించడం, ఫొటోను మార్చేందుకు అనవసర అనుమతులు కోరే అనువర్తనాలను ఇన్‌స్టాల్ చేయించడం ద్వారా మోసాలకు పాల్పడవచ్చు.

సరదా కోసం.. సమాచారం పణంగా పెట్టొద్దు!

రెట్రో ఫొటో కావాలన్న ఆసక్తితో తెలియని వెబ్‌సైట్లలో వ్యక్తిగత ఫొటోలను అప్‌లోడ్ చేయడం కూడా జాగ్రత్తగా ఆలోచించాల్సిన విషయమే. ఫొటోతో పాటు పేరు, ఫోన్ నంబర్, ఈమెయిల్, ఇతర వివరాలను సేకరించే నకిలీ వేదికలు ఉ ండొచ్చు. అందుకే అపరిచిత లింకులు, ఏపీకే ఫైళ్లు, అనుమానాస్పద అనువర్తనాలకు దూరంగా ఉండాలని సైబర్ భద్రత నిపుణులు సూచిస్తున్నారు.రెట్రో లుక్ కోసం ఒక్క క్లిక్.. మీ డిజిటల్ భద్రతకు మాత్రం పెద్ద ముప్పు కావొచ్చు. సరదా సరే.. కానీ క్లిక్ చేసే ముందు ఆలోచించాల్సిందే!

**పర్మిషన్ల పేరుతో దోపిడీ**

అనధికారిక ఏపీకే ఫైల్స్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయగానే, ముందుగా అవి మొబైల్ కాంటాక్ట్స్, గ్యాలరీ, కెమెరా, మరియు ఇన్‌కమింగ్ మెసేజ్‌లను చదివే అనుమతులను అడుగుతాయి. యాప్ పనిచేయడానికి ఇవి సాధారణమే అని భావించి గుడ్డిగా 'అలౌ' నొక్కేయడంతో అసలు ప్రమాదం మొదలవుతుంది. ఈ అనుమతుల ద్వారా యూజర్ల వ్యక్తిగత ఫోటోలు, పర్సనల్ చాట్స్, బ్యాంకు ఖాతా పాస్‌వర్డ్‌లు, సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీలు క్షణాల్లోనే హ్యాకర్ల సర్వర్‌లకు చేరిపోతున్నాయి. ఫలితంగా వ్యక్తిగత సమాచారం డార్క్ వెబ్‌లో అమ్ముడుపోవడమే కాకుండా, బ్యాంకు ఖాతాలు రాత్రికి రాత్రే ఖాళీ అవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రైవేట్ ఫోటోలను తస్కరించి, బ్లాక్ మెయిల్ (సెక్స్‌టార్షన్) చేస్తున్న ఘటనలు కూడా వెలుగుచూస్తున్నాయి.

**ఈ జాగ్రత్తలు ముఖ్యం**



అవాంఛిత లింకులు వద్దు: వాట్సాప్, టెలిగ్రామ్‌లలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫొటో ఎడిటింగ్ లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకండి.

ఏపీకే ఫైల్స్‌తో డేంజర్: గూగుల్ ప్లే స్టోర్ (ఆండ్రాయిడ్), యాప్ స్టోర్ (ఐఓఎస్) లాంటి అధికారిక ప్లాట్‌ఫారమ్‌ల నుంచే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. థర్డ్-పార్టీ వెబ్‌సైట్ల నుంచి పంపే ఏపీకే ఫైల్స్‌ను ఎప్పుడూ ఇన్‌స్టాల్ చేయవద్దు.

పర్మిషన్లు ఇచ్చే ముందు ఆలోచించండి: ఏదైనా కొత్త యాప్ ఇన్‌స్టాల్ చేసినప్పుడు, అది అడిగే పర్మిషన్లకు, యాప్ చేసే పనికి సంబంధం ఉందో లేదో సరిచూసుకోండి. ఒక సాధారణ ఫోటో ఎడిటింగ్ యాప్‌కు మీ బ్యాంక్ మెసేజ్‌లు చదివే అనుమతి, కాంటాక్ట్స్ యాక్సెస్ ఎందుకో ప్రశ్నించుకోవాలి.

సైబర్ హెల్ప్‌లైన్: ఒకవేళ పొరపాటున లింక్ క్లిక్ చేసి మోసపోయినట్లు గుర్తిస్తే, వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయండి.

# నినాదాలు.. నిరసన పాటలు

మొదటి పేజీ తరువాయి

తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలో ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, ఎల్.రమణ, దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంసీ కోటిరెడ్డి, వాణీదేవి, నవీన్‌రావు తదితరులు వెల్‌వైపు దూసుకొచ్చారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ చర్చకు పట్టుబట్టారు. ప్లకార్డులు తీసేయాలని చైర్మన్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా వెనక్కి తగ్గలేదు. 'కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడదాం.. ముఖ్యమంత్రి భూ దోపిడీ నశించాలి.. సీఎం కుటుంబ సభ్యులకు కేటాయించిన భూములను రద్దు చేయాలి.. 22ఏ నిషేధిత భూముల అంశంపై వెంటనే చర్చ చేపట్టాలి' అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. అయితే, వాళ్లు చైర్మన్ పోడియం వద్దకు వెళ్లకుండా మార్షల్స్ అడ్డుకున్నారు. ఈ సమయంలో శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకున్నారు. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే సభ మర్యాద పాటిస్తూ నిబంధనలు పాటించాలని సూచించారు. మరోవైపు ప్రశ్నోత్తరాలు కొనసాగించడంతో బీఆర్ఎస్ సభ్యులు పోడియం వద్దే నిలబడి తమ నిరసన కొనసాగించారు. దేశపతి శ్రీనివాస్, గోరటి వెంకన్న కాంగ్రెస్ పార్టీ విధానాలు, సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నిరసన పాట లు పాడారు. దీనికి మిగిలిన ఎమ్మెల్సీలు చ ప్పట్లతో కోరస్ ఇచ్చారు. దీంతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. చైర్మన్ వారించినా బీఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. అయినా ప్రశ్నోత్తరాలను కొనసాగించారు. బీఆర్ఎస్ సభ్యులు తమ స్థానాల్లో కూర్చుంటే ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానంపై చర్చించే అవకాశం ఇస్తానని చైర్మన్ ప్రకటించారు. కాసేపటి తర్వాత ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్టు చైర్మన్ ప్రకటించారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

## త్వరలో 6 డీఏలు ప్రకటిస్తా

మొదటి పేజీ తరువాయి

నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్ఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు. ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్ఈఎస్ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్ఈఎస్ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## సోషల్ మీడియాలో బూతులు

మొదటి పేజీ తరువాయి

తీసుకెళ్లింది. సమాచార సాంకేతిక (ఐటీ) నిబంధనలు-2021కి తగిన సవరణలు చేసి మైనర్లు నేరుగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లతో ఒప్పందాలు చేసుకోకుండా నిరోధించాలని కోరింది. మైనర్ల ఖాతాలకు తల్లిదండ్రులు లేదా సంరక్షకుల భాగస్వామ్యాన్ని తప్పనిసరి చేయాలని విజ్ఞప్తి చేసింది.

## కేటీఆర్, హరీశ్ లైంగిక వేధింపులు!

మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదులో పేర్కొన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ తమను అవమానకర రీతిలో దూషించారని ఆమె తెలిపారు. హరీశ్‌రావు తన టీ-షర్టును విప్పి ఓ పోలీసు అధికారిపైకి విసిరి, మహిళా సిబ్బంది ముందే అర్ధనగ్నంగా నిలబడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా అదే విధంగా ప్రవర్తించి, తమకు తీవ్ర ఇబ్బంది కలిగించారని ఫిర్యాదులో వివరించారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## '60 రోజుల డెడ్‌లైన్' రద్దు!

మొదటి పేజీ తరువాయి

అదనపు గడువును రద్దు చేసేందుకు సంబంధించిన ముసాయిదా ప్రతిపాదనను అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) గురువారం విడుదల చేసింది. దీని ప్రకారం.. ఉ ద్యోగం కోల్పోతే వెంటనే అమెరికాను వీడాల్సిందే. దీని ప్రభావం ప్రధానంగా హెచ్1బీ, ఎల్1, ఓ1 వీసాదారులపై ఎక్కువగా ఉ ంటుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఉద్యోగం కోల్పోయిన అర్హత గల హెచ్1బీ ఉద్యోగులు వరుసగా 60 రోజుల వరకు లేదా వారి అధీకృత నివాసం ముగిసే వరకు, ఏది ముందుగా వస్తే దాని వరకు విచక్షణాపరమైన గడువును పొందవచ్చు. ఈ కాలంలో వారు మరొక స్పాన్సరింగ్ యజమాని కోసం వెతుకవచ్చు. హోదా మార్పు కోరవచ్చు. లేదా అమెరికాను విడిచి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకోవచ్చు. అయితే హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఈ 60 రోజుల గడువును తొలగించాలని ప్రతిపాదిస్తోంది. ఇది భారత విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది.

## రేవంత్ 18 గంటల పని.. సోదరుల కోసమే!

మొదటి పేజీ తరువాయి

సందర్శించిన కేటీఆర్.. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఒక్క రోజే శ్రీవారికి రూ.6.93 కోట్ల ఆదాయం

మొదటి పేజీ తరువాయి

బ్రహ్మోత్సవాలు, ప్రధాన పండగల సందర్భాల్లో 3 సార్లు రూ. 6 కోట్లకు పైగా రాబడి రాగా, ఇప్పుడు ఆ పాత రికార్డులన్నింటినీ అధిగమిస్తూ రూ. 6.93 కోట్ల గరిష్ట ఆదాయం నమోదైంది. శ్రీవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు తమ మొక్కుబడులను, కానుకలను హుండీలో సమర్పించడంతో ఈ రికార్డు స్థాయి ఆదాయం లభించింది.

## సెక్రటేరియట్‌లోనే లంచం!

### ఏసీబీ చేతికి చిక్కిన ఉద్యోగి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణ సచివాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) సెక్షన్‌లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇచ్చేందుకు బాధితుడి నుంచి రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం లంచం అడగడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. గురువారం సచివాలయ ప్రాంగణంలో నిఘా ఏర్పాటు చేశారు. సచివాలయంలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.లక్ష లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సీఎంఆర్ఎఫ్ సెక్షన్‌లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేయడం వెనుక మరికొందరి పాత్ర ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రెగ్యులర్ అధికారుల ప్రమేయం ఉందా? అన్నదీ ఏసీబీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## రూ.18 వేల కోట్ల భరణం

మొదటి పేజీ తరువాయి

ఒకరు. ఆయన స్థాపించిన స్మైల్‌గేట్ దేశంలోని అతిపెద్ద వీడియో గేమ్ కంపెనీల్లో ఒకటి. క్రాస్‌ఫైర్, లాస్ట్ ఆర్క్ వంటి ప్రముఖ గేమ్స్ ఈ కంపెనీకి చెందినవే. బ్లూమ్‌బర్గ్ అంచనాల ప్రకారం క్వాన్ సంపద సుమారు 3 బిలియన్ డాలర్లు. కోర్టు తీర్పు ప్రకారం, స్మైల్‌గేట్‌లో క్వాన్‌కు ఉన్న 35 శాతం వాటాను ఆయన మాజీ భార్య లీ హ్వా-జిన్‌కు బదిలీ చేయాలి. ఈ వాటా విలువ సుమారు 2.5 ట్రిలియన్ వాన్స్. అంతే కాకుండా అదనంగా మరో 65 బిలియన్ వాన్ నగదుగా చెల్లించాలని కూడా కోర్టు ఆదేశించింది. క్వాన్, లీ హ్వా-జిన్‌లు 2001లో వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత ఏడాదికే అంటే 2002లో క్వాన్ స్మైల్‌గేట్‌ను స్థాపించారు. విడాకుల కోసం దరఖాస్తు చేసిన సమయంలో లీ కంపెనీలో 50 శాతం వాటాను కోరారు. కంపెనీ ప్రారంభ సమయంలో తాను ఆర్థికంగా సహాయం చేశానని ఆమె వాదించారు. అంతేకాదు.. వివాహం తర్వాత రెండు దశాబ్దాలకు పైగా తాను పిల్లలను పెంచడం, కుటుంబ బాధ్యతలను చూసుకోవడంలో గడిపానని లీ పేర్కొన్నారు. కంపెనీ ఏర్పడిన సమయంలో తాను చేసిన సహకారాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అయితే.. క్వాన్ మాత్రం ఆమె కంపెనీలో పెట్టుబడి పెట్టలేదని, కంపెనీ కోసం పనిచేయలేదని వాదించారు. స్మైల్‌గేట్ కూడా ఈ ఏడాది ప్రారంభంలో ఓ ప్రకటన చేస్తూ, కంపెనీ ప్రారంభానికి అవసరమైన మొత్తం పెట్టుబడిని క్వాన్ ఒక్కడే సమకూర్చారని తెలిపింది. అయినప్పటికీ.. కోర్టు తాజాగా లీకి భారీ మొత్తంలో ఆస్తులు, కంపెనీ వాటా ఇవ్వాలని తీర్పు చెప్పడం గమనార్హం.

## కొండగట్టు పనులకు మోక్షం

మొదటి పేజీ తరువాయి

చొరవతో, తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో కొండగట్టులో ఈ అభివృద్ధి పనులకు రూ.35.19 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అనంతరం దీక్షా విరమణ మండపం, భక్తుల కోసం 96 గదుల సత్రం నిర్మాణానికి శంకుస్థాపన జరిగినప్పటికీ, వివిధ సాంకేతిక కారణాలతో పనులు నిలిచిపోయాయి. తాజాగా, సీఎం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దీక్షా విరమణ మండపం నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఒకేసారి 2,000 మంది హనుమాన్ దీక్షాధారులు దీక్ష విరమించుకునేలా ఆధునిక సౌకర్యాలతో ఈ మండపాన్ని నిర్మించనున్నారు. దీంతో దీక్షా కాలంలో కొండగట్టుకు భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు మరింత సౌకర్యం కలగనుంది. అలాగే దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వసతి కోసం 96 గదులతో సత్రం లేదా అతిథి గృహాన్ని నిర్మించనున్నారు. ఈ రెండు నిర్మాణాలు పూర్తయితే ఏటా లక్షలాది మంది కొండగట్టు అంజన్న భక్తులు, హనుమాన్ మాలాధారులకు వసతి, దీక్షా విరమణకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. త్వరలోనే పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు.

## కార్గో నౌకలో 20 మంది దగ్ధం

బీజింగ్: చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్‌లో మరమ్మతుల నిమిత్తం నిలిపి ఉంచిన ఒక కార్గో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో సుమారు 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. లైబీరియా జెండాతో ఉన్న 'ఓషన్ మెలోడీ' అనే కార్గో నౌకను మరమ్మతుల కోసం షిప్‌యార్డ్‌కు తీసుకువచ్చారు. పనులు జరుగుతున్న క్రమంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నౌకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రధాని లీ కియాంగ్ స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

**కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రేవంత్ దిశానిర్దేశం**

**ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన**

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): ప్రతిపక్ష బీఆర్ఎస్ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని, అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదని ఆయన వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభ్యులు పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించడమే కాకుండా, మహిళా అధికారుల ముందే టీ-షర్టులు తీసి అసభ్యంగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకర భాషను ఉపయోగిస్తూ, సభా కార్యక్రమాలకు విఘాతం కలిగించారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రతిపక్షాల కుతంత్రాలను బలంగా తిప్పికొట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా అసెంబ్లీకి హాజరై, చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సూచించారు.

## రిజర్వాయర్లపై ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు

**అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి స్పష్టీకరణ**

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

## రంగారెడ్డి జిల్లాలో రియల్టర్ ఆత్మహత్య

రంగారెడ్డి, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): హైదరాబాద్ శివారు రంగారెడ్డి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, హోమ్ ల్యాండ్ సంస్థ అధినేత రామ్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కందుకూరు మండలం నెదునూరు గ్రామంలోని తన ఫామ్‌హౌస్‌లో ఆయన బలవన్మరణం చెందారు. రామ్ రెడ్డి పటాన్‌చెరు ప్రాంతంలో సుమారు 280 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొందరు రాజకీయ నాయకుల నుంచి ఆయనపై తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఆ ఒత్తిళ్లను తట్టుకోలేకే ఆయన ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## సీఎం సొంతూరిలోనూ కరెంటు కోతలు: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని... కేసీఆర్ హయాంలో లభించిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ స్థానంలో మళ్లీ పాతకాలపు కరెంటు కోతలు పునరావృతమవుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు తమ కష్టాలను వెళ్లబోసుకుంటున్న వీడియోను సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పంచుకుంటూ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అసలైన మార్పు ఇదేనా?" అని కేటీఆర్ తన పోస్టులో ప్రశ్నించారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి పాలమూరు జిల్లాలో, ఆయన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనే రైతులు విద్యుత్ కోతలతో విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా వోల్టేజ్, సమయానికి కరెంటు రాకపోవడంతో పొలాలకు నీళ్లు పారక పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు.

## గణేశ్ నిమజ్జనానికి వ్యతిరేకం కాదు: హైడ్రా

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# విజయవాడ మేయర్.. దేవినేనికా? బోండాకా?

**బెజవాడ టీడీపీలో ఆసక్తికర పరిణామాలు.. అధిష్ఠానం నిర్ణయంపైనే ఉత్కంఠ**




విజయవాడ, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): ఏపీలోని బెజవాడ నగర రాజకీయాలు మరోసారి వేడెక్కుతున్నాయి. విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ పీఠం ఎవరికి దక్కబోతోందన్న చర్చ అధికార కూటమిలో జోరుగా సాగుతోంది. ఒకవైపు విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తనయుడు బోండా సిద్ధార్థ పేరును బలంగా ముందుకు తీసుకొస్తుండగా.. మరోవైపు దేవినేని కుటుంబం నుంచి కూడా మేయర్ పదవికి ఆశావహుల పేర్లు తెరపైకి రావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే బోండా ఉమా తన కుమారుడు సిద్ధార్థతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలసి మేయర్ అభ్యర్థిత్వంపై చర్చించినట్లు సమాచారం. సిద్ధార్థ విద్యార్హతలు, రాజకీయ చురుకుదనం, విజయవాడలో యువతతో ఉన్న పరిచయాలను వివరిస్తూ ఆయనకు అవకాశం కల్పించాలని బోండా ఉమా కోరినట్లు వెల్లడించారు. మరోవైపు దేవినేని కుటుంబం కూడా మేయర్ పీఠంపై దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దేవినేని అపర్ణ పేరు ఇప్పటికే ఆశావహుల జాబితాలో వినిపిస్తోంది. తాజాగా ఆమెకు సంబంధించిన రాజకీయ కదలికలు, పార్టీ ముఖ్య నేతలతో భేటీలపై చర్చ పెరగడంతో దేవినేని కుటుంబం మేయర్ రేసులో ఉందన్న ప్రచారం ఊపందుకుంది. ఈసారి మేయర్ పీఠానికి ప్రత్యక్ష ఎన్నికలు జరగనుండటం పోటీని మరింత కీలకంగా మార్చింది. గతంలో కార్పొరేటర్ల ద్వారా మేయర్ ఎన్నిక జరిగే పరిస్థితికి భిన్నంగా.. ఇప్పుడు ప్రజలే నేరుగా మేయర్‌ను ఎన్నుకునే విధానం అమల్లోకి వచ్చింది. దీంతో అభ్యర్థి వ్యక్తిగత ప్రజాబలం, నియోజకవర్గాల మధ్య సమన్వయం, సామాజిక-రాజకీయ సమీకరణాలు, పార్టీ కేడర్‌పై పట్టు వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. విజయవాడ మేయర్ పదవి కోసం టీడీపీలోనే 15 మందికి పైగా ఆశావహులు ఉన్నారని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నట్లు సమాచారం. బోండా ఉమా తన కుమారుడికి మేయర్ అవకాశం ఇవ్వాలని కోరుతున్న విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. అయితే తుది నిర్ణయం ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. ఇదే ఇప్పుడు బెజవాడ టీడీపీలో అసలు ఉత్కంఠకు కారణంగా మారింది. బోండా సిద్ధార్థకు అవకాశం ఇస్తే యువ నాయకత్వాన్ని ప్రోత్సహించినట్లవుతుందనే వాదన వినిపిస్తోంది. మరోవైపు దేవినేని కుటుంబానికి అవకాశం కల్పిస్తే విజయవాడ రాజకీయాల్లో ఆ కుటుంబానికి ఉన్న పాత రాజకీయ పునాదులను ఉపయోగించుకోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మేయర్ అభ్యర్థి ఎంపికలో కేవలం వ్యక్తిగత బలం మాత్రమే కాకుండా విజయవాడలోని మూడు శాసనసభ నియోజకవర్గాల రాజకీయ సమీకరణాలు, కూటమి పార్టీల మధ్య సమన్వయం, స్థానిక నాయకుల మద్దతు, సామాజిక వర్గాల సమీకరణం వంటి అంశాలు ప్రభావం చూపే అవకాశం ఉంది. బొండా సిద్ధార్థ ఇప్పటికే మేయర్ రేసులో బలంగా ముందుకు వచ్చారు. దేవినేని కుటుంబం పేరు కూడా తెరపైకి రావడంతో పోటీ రెండు ప్రధాన రాజకీయ కుటుంబాల మధ్య ఆసక్తికర మలుపు తిరిగిందన్న చర్చ జరుగుతోంది.

# మంత్రి పదవి డిసైడర్ రేవంత్ కాదు!

**ఆ అంశం అధిష్ఠానం పరిధిలోనిదే.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తన భేటీపై సాగుతున్న ప్రచారానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెరదించారు. సీఎం, తాను ఎప్పుడూ కలహించుకోవాలని కొందరు కోరుకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి, నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని కలవడంలో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పనుల నిమిత్తం వారిని కలవడం అనివార్యమని, దీనికి రాజకీయ అర్థాలు ఆపాదించవద్దని కోరారు. ముఖ్యమంత్రితో తనకు అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమేనని, అయితే అవి సహజమైనవని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పదవి కోసం తాను ముఖ్యమంత్రికి లొంగిపోయినట్లు కొందరు, ఇద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయని మరికొందరు చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. "ముఖ్యమంత్రిని కలిస్తే లొంగిపోయినట్లు, కలవకపోతే దూరం పెరిగినట్లు రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. నేను, సీఎం ఘర్షణ పడాలని కొందరు ఆశిస్తున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి పదవుల విస్తరణ అంశం పూర్తిగా పార్టీ అధిష్ఠానం పరిధిలోనిదని, గతంలో తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ లభించినట్లు రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. అధిష్ఠానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. కొండా సురేఖ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరులో ఎలాంటి తప్పు లేదని, ఆయన అధిష్ఠానానికి సరైన సమాచారాన్నే అందించారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భిన్నమైన అభిప్రాయాలు ఉండటం సహజమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయం స్వల్ప మొత్తమేమీ కాదని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

# కర్నూలులో భూకంపం

**ఇళ్ల నుంచి పరుగులు తీసిన జనం**



కర్నూలు, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): ఏపీలోని కర్నూలు జిల్లాలో హఠాత్తుగా భూకంపం సంభవించింది. దీంతో ప్రజలను తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కర్నూలుతో పాటు ఆదోని, దాని పరిసర ప్రాంతాల్లో ఒక్కసారిగా భూమి కంపించడంతో ఇళ్లలోని వస్తువులు, పాత్రలు భయంకరమైన శబ్దాలతో కదిలిపోయాయి. ఈ ధాటికి ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇళ్లలో ఉంటే ఏమవుతుందోనన్న భయంతో చిన్నపిల్లలు, వృద్ధులతో సహా వీధుల్లోకి, ఖాళీ ప్రదేశాల్లోకి పరుగులు తీశారు. కొద్దిసేపటి వరకు ఏం జరుగుతుందో అర్థం కాక తీవ్ర భయాందోళనల మధ్యే వీధుల్లో కాలం గడిపారు. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.5గా నమోదైనట్లు సంబంధిత భూకంపశాఖ అధికారులు ప్రాథమికంగా ధృవీకరించారు. భూ అంతర్భాగంలో జరిగిన చిన్నపాటి సర్దుబాట్ల వల్లే ఈ ప్రకంపనలు చోటుచేసుకున్నాయని, తీవ్రత తక్కువగానే ఉండటం వల్ల పెద్దగా ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించలేదని అధికారులు స్పష్టం చేశారు. అయితే భూమి స్వల్పంగానే కంపించినప్పటికీ, స్థానికంగా వచ్చిన విచిత్రమైన శబ్దాలు ప్రజల్లో వణుకు పుట్టించాయి. ఆదోని పట్టణంతో పాటు చుట్టుపక్కల ఉన్న పలు గ్రామాల్లో కూడా ఈ ప్రభావం కనిపించింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక యంత్రాంగం, పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని సమీక్షించారు. బాధితుల నుంచి సమాచారం సేకరించారు. ఎక్కడైనా గోడలు కూలడం లేదా ఆస్తి నష్టం జరిగిందా అనే కోణంలో తనిఖీలు చేపట్టారు. భూకంప తీవ్రత తక్కువగానే నమోదైనందున ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# అత్తామామలు వేధిస్తున్నారు

**గవర్నర్ వద్దకు జోగి రమేశ్ కుటుంబ వివాదం**



విజయవాడ, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేశ్ కుటుంబ వివాదం మరో కీలక మలుపు తిరిగింది. ఆయన కోడలు మేఘన, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. తన భర్త, అత్తమామల నుంచి ప్రాణహాని ఉందని, తనకు తక్షణమే రక్షణ కల్పించాలని ఆమె గవర్నర్‌ను అభ్యర్థించారు. వరకట్న వేధింపులు, హత్యాయత్నం వంటి తీవ్ర ఆరోపణలతో ఆమె గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయిన మేఘన, తన అత్తమామలు అదనపు కట్నం కోసం తీవ్రంగా వేధిస్తున్నారని ఆరోపించారు. తన భర్త రాజీవ్, మామ జోగి రమేశ్, అత్త శకుంతల సహా కుటుంబ సభ్యులు తనపై పలుమార్లు హత్యాయత్నం చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తన వాదనలు విన్న గవర్నర్, ఈ కేసును తెలంగాణకు బదిలీ చేసుకుంటే న్యాయపోరాటానికి సులభంగా ఉంటుందని సూచించినట్లు సమాచారం. ఈ ఏడాది జులైలో మేఘన తొలిసారిగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పెళ్లి సమయంలో తన కుటుంబం రూ.5 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, అదనంగా మరో రూ.5 కోట్లు, కార్లు, ఆభరణాలు తీసుకురావాలని వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. గోవా పర్యటనలో పడవ నుంచి నీటిలోకి నెట్టేసి చంపేందుకు ప్రయత్నించారని కూడా ఆమె గతంలో ఆరోపించారు. దీంతో జోగి రమేశ్ సహా 11 మందిపై వరకట్న వేధింపులు, గృహ హింస, హత్యాయత్నం కింద కేసు నమోదైంది. అయితే, ఈ ఆరోపణలను జోగి రమేశ్ కుటుంబం ఖండించింది. ఇది కేవలం కుటుంబ వివాదమని, దానికి రాజకీయ రంగు పులుముతున్నారని వారు పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే కొందరు నిందితులు ముందస్తు బెయిల్ పొందారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## 1.2 లక్షల చేయూత దరఖాస్తులు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణలో అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 చివరి తేదీ అని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4,66,351 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారని చెప్పారు. ఇప్పటివరకు దివ్యాంగుల పింఛన్ల కోసం 1,23,199 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అర్హత ఉన్నవారికి పింఛన్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. థలసేమియా బాధితులకు పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారని తెలిపారు. సదరం సర్టిఫికెట్లను గడువులోగా రెన్యువల్ చేసుకోకపోవడం వల్ల కొందరికి పింఛన్లు నిలిచిపోతున్నాయని సీతక్క చెప్పారు. అర్హులైన వారు తమ సదరం సర్టిఫికెట్లను తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.

## 22ఏ చర్చ లేదేందుకు?

**మండలిలో రసాభాస.. బీఆర్ఎస్ వాకౌట్**

**మార్షల్స్ తీరుపై మధుసూదనాచారి ఫైర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): శాసనమండలిలో 22ఏ నిషేధిత భూముల వివాదంపై ఈరోజు తీవ్ర గందరగోళం నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ రికార్డులు, 22ఏ భూములకు సంబంధించిన సమస్యలపై తక్షణమే పూర్తిస్థాయి చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. అయితే మండలి చైర్మన్ ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తూ, ముందస్తు ఎజెండా ప్రకారం ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్మన్ నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు పోడియం వైపు దూసుకెళ్లి నినాదాలు చేయడంతో సభలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో సభను సజావుగా సాగనివ్వాలని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని సహకరించాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేసినప్పటికీ బీఆర్ఎస్ నేతలు శాంతించలేదు. ప్రభుత్వం చర్చకు భయపడుతోందని ఆరోపిస్తూ సభ జరుగుతున్న తీరుకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులందరూ మండలి నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. వాకౌట్ అనంతరం మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మీడియాతో మాట్లాడుతూ... శాసనమండలి ప్రాంగణంలో ప్రతిపక్ష సభ్యుల పట్ల మార్షల్స్ ప్రవర్తించిన తీరును తప్పుబట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధుల హక్కులను భంగపరిచేలా మార్షల్స్ వ్యవహరించడం శోచనీయమని ఆయన మండిపడ్డారు.

## సీట్ల పంపకాలపై క్లారిటీ రాలేదు

విజయవాడ, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల పంపకాలకు సంబంధించి ఇప్పటివరకు పూర్తి స్థాయి క్లారిటీ రాలేదని మాధవ్ స్పష్టంచేశారు. అయితే దీనిపై ఎలాంటి గందరగోళానికి తావులేదని, రాబోయే మూడు రోజుల్లో కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఒకచోట కూర్చుని సమగ్రంగా చర్చిస్తారని ఆయన తెలిపారు. పరస్పర సమన్వయంతో సీట్ల సర్దుబాటు ప్రక్రియను త్వరలోనే కొలిక్కి తెస్తామని వివరించారు.

# రైతుల కోసం నల్లకోటు ధరిస్తా

## 22ఏ విషయంలో అన్నదాతలకు అన్యాయం.. సర్కారువి ఒంటెద్దు పోకడలు: జీవన్ రెడ్డి

జగిత్యాల, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో 22ఏ నిషేధిత భూముల సమస్యపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి కీలక హామీ ఇచ్చారు. నిషేధిత జాబితాలో చేర్చిన రైతుల భూములకు న్యాయం చేయడం కోసం అవసరమైతే మళ్లీ న్యాయవాద వృత్తిని చేపట్టి రైతుల తరఫున పోరాడతానని ప్రకటించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలోని మున్నూరు కాపు నూతన కార్యవర్గ సభ్యులు జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించిన అనంతరం జీవన్ రెడ్డి రైతుల భూముల సమస్యలపై మాట్లాడారు. ఎస్ఆర్ఎస్పీ కాలువ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు.. మిగిలిన భూములను కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను తక్షణమే తొలగించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల సమస్యతో రైతులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్న జీవన్ రెడ్డి.. రైతుల భూముల హక్కుల కోసం అవసరమైతే మళ్లీ న్యాయవాద వృత్తిలోకి వెళ్లి న్యాయపోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. తాను స్వయంగా వ్యవసాయం చేస్తున్న రైతు బిడ్డనని, రైతుల కష్టాలు తనకు తెలుసని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా జీవన్ రెడ్డి విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి స్వయంగా వ్యవసాయం చేస్తే రైతుల కష్టాలు తెలిసేవని, రైతుల



సమస్యలను ప్రభుత్వం మరింత సానుభూతితో పరిష్కరించాలని సూచించారు. మొత్తంగా 22ఏ నిషేధిత భూముల సమస్యకు పరిష్కారం కోసం రైతులకు అండగా నిలుస్తానని, అవసరమైతే న్యాయపోరాటానికి కూడా సిద్ధమని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం: నందయ్య

జగిత్యాల, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): జగిత్యాల: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి (చిట్యాల) ఐలమ్మ పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయమని డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నందయ్య మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ చూపిన తెగువ తెలంగాణ ధీరత్వానికి తార్కాణమని, బహుజన పోరాట పటిమకు ప్రతీకగా నిలిచారని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఐలమ్మ ధైర్యం, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ సేవాదళ్ కార్యదర్శి బోగోజీ ముకేష్ ఖన్నా, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దుమాల రాజ్‌కుమార్, కౌన్సిలర్ గిరిధర్, పెద్దింటి రాజు, మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తి: ఏసీఎస్ రాజు

జగిత్యాల, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి భారత్ సురక్ష సమితి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆమె ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అరవ లక్ష్మి, అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, వేముల పోచమల్లు, మ్యాన సుధాకర్, నాయిని సంజీవ్‌రావు, కొక్కుల ఆంజనేయులు, చిలుక రాజన్న, బొందుకురి ప్రీనివాస్, కొత్తకొండ బాలన్న తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు పండిట్ గంగాధర్‌కు కాళోజీ పురస్కారం

జగిత్యాల, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పెన్షనర్ భవన్‌లో ప్రముఖ కవి, రచయిత, తెలుగు ఉపాధ్యాయుడు ముత్యంపేట గంగాధర్‌కు కాళోజీ నారాయణరావు పురస్కారం ప్రదానం చేశారు. కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం, జగిత్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు గుండేటి రాజు పురస్కారాన్ని అందజేశారు. ప్రస్తుతం గంగాధర్ సుద్దపెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. సాహిత్య రంగంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ పురస్కారం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, తెలుగు భాషా ఫోరం జగిత్యాల జిల్లా బాధ్యులు బి. శేషగిరి, చందా సత్యనారాయణ, అన్నారంభట్ల సూర్యనారాయణ, డాక్టర్ శ్రీని వాస్, కవిత, మద్దెల సరోజన, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, వల్లంపట్ల గిరీష్ కుమార్, జన్మంచి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు పండితులు, సాహితీవేత్తలు గంగాధర్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. జిల్లాలోని తెలుగు ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## చిన్నారికి గుండె చికిత్సకు రూ.4 లక్షల ఎల్వోసీ

జగిత్యాల/బీర్పూర్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.4 లక్షల విలువైన ఎల్ఓసీని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. బీర్పూర్ మండలం తాళ్ల ధర్మారం గ్రామానికి చెందిన గంగాధరి సుమన్–నవ్య దంపతుల కుమార్తె గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చిన్నారి చికిత్స కోసం స్థానిక నాయకులతో కలిసి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్‌ను సంప్రదించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం సీఎం సహాయ నిధి ద్వారా రూ.4 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. హైదరాబాద్‌లో చిన్నారి కుటుంబ సభ్యులకు ఎల్ఓసీని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఆగమనానికి ఘన ఏర్పాట్లు

జగిత్యాల, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని కృష్ణానగర్, వాణినగర్‌లో గణేష్ ఆగమనం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు యూత్ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణనగర్‌లోని రావణ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 13న శ్రీ గణేష్ ఆగమనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే, వాణినగర్‌లో త్రిశూల్స్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 11న గణేష్ ఆగమనం వేడుకలను నిర్వహించనున్నారు. భక్తిశ్రద్ధలతో జరిగే కార్యక్రమాల్లో భక్తులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ వేడుకలను విజయవంతం చేయాలని రావణ యూత్, త్రిశూల్స్ యూత్ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## రమాదేవికి శుభాకాంక్షల వెల్లువ

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమాదేవి జన్మదినం సందర్భంగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆమెను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, గోపాల్, రాజ్యలక్ష్మి, పోశెట్టిగౌడ్, ధాతి రమేష్, రాజుగౌడ్, సూరిబాబు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఎమ్మెల్సీ లక్ష్యంగా జేఏసీ ముందడుగు

**జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర కమిటీలో నియామకాలు**

**ముగ్గురికి కీలక బాధ్యతలు: చైర్మన్ తొగరి కరుణాకర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కమిటీ విస్తరణలో భాగంగా పలువురిని వివిధ బాధ్యతల్లో నియమించారు. హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ సలీంను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ఖమ్మం జిల్లాకు చెందిన నలుబోలు మధులతను రాష్ట్ర కార్యదర్శిగా, కరీంనగర్ జిల్లాకు చెందిన గెల్లు రాజశేఖర్‌ను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు జేఏసీ చైర్మన్ తొగరి కరుణాకర్ వారికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. తెలంగాణలో జర్నలిస్టులకు శాసనమండలిలో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గవర్నర్ కోటాలో నామినేటెడ్ పద్ధతిలో జర్నలిస్టులకు మూడు ఎమ్మెల్సీ పదవులు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించేందుకు ఈ ప్రాతినిధ్యం ఉపయోగపడుతుందని అన్నారు. వచ్చే అక్టోబర్‌లో రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల నుంచి జర్నలిస్టులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి హైదరాబాద్ కేంద్రంగా 'జర్నలిస్టుల సమరభేరి' నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇప్పటివరకు అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాల విషయంలో తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. జర్నలిస్టుల కుటుంబాలకు భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు రూ.కోటి వరకు ప్రత్యేక బీమా సౌకర్యం కల్పించేలా ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల సంక్షేమానికి రూ.వెయ్యి కోట్లతో ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలపై గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. యూనియన్లకు అతీతంగా జర్నలిస్టులంతా జేఏసీలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

**ఉస్మానియా వర్సిటీలో ఘన నివాళి**



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా నివాళులు అర్పించారు. విద్యార్థి జన సమితి నాయకుడు కడారి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఆమె త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, సమానత్వం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆలోచనలు, పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని, సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోటూరి మనవత్రాయ్, సీనియర్ విద్యార్థి నాయకులు ఆర్.ఎల్. మూర్తి, కంచర్ల బద్రి, పరిశోధక విద్యార్థి మహేష్ గౌడ్, జేవీఎస్ విద్యార్థి నాయకుడు చేరాల వంశీ, విద్యార్థి నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి ఆత్మహత్య.. కుమారుడి కోసం గాలింపు



మల్యాల, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): మల్యాల మండల కేంద్రానికి చెందిన గుండేటి కవిత (34), ఆమె చిన్న కుమారుడు శశాంక్ (7) బావిలోకి వెళ్లిన విషాద ఘటన గురువారం చోటుచేసుకుంది. కవిత మృతదేహం లభించగా, చిన్నారి శశాంక్ ఆచూకీ కోసం గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు కొనసాగుతోంది. పోలీసుల వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున కవిత తన సోదరుడు ఆడెపు కొమురయ్యకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని, తన పెద్ద కుమారుడిని జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించగా ఉదయం 5.30 గంటల సమయంలో ముత్యంపేట శివారులోని మారుపాక విశ్వనాథ్ బావి వద్ద కవితకు చెందిన చెప్పులు, మొబైల్ ఫోన్ కనిపించాయి. బావిలో పరిశీలించగా కవిత నీటిలో కనిపించింది. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో ఆమె మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కవితకు నిఖిలేశ్ (11), శశాంక్ (7) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, అప్పులు, కుమారుడి అనారోగ్యం కారణంగా ఆమె తీవ్ర మనస్తాపానికి గురైనట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. బావిలో గాలించినప్పటికీ సాయంత్రం వరకు శశాంక్ ఆచూకీ లభించలేదు. గజ ఈతగాళ్లతో గాలింపు కొనసాగుతోంది. మృతురాలి అన్న కొమురయ్య, తండ్రి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం: వెంకటేష్ గౌడ్

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తన కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, చైతన్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. హక్కుల సాధన కోసం ఆమె చట్టపరమైన పోరాటం కూడా సాగించారని గుర్తుచేశారు. ఐలమ్మ స్ఫూర్తి తెలంగాణ ఉద్యమంలోనూ, అనంతర ప్రగతి ప్రస్థానంలోనూ కొనసాగిందన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, గోపాల్, పోశెట్టిగౌడ్, మల్లేష్, ఖలీమ్, నరసింహ, సుధ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేద విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 10: శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రాజరాజేశ్వర వేద పాఠశాల విద్యార్థులు వివిధ వేద పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని సరిపల్లెలో ఆగస్టు 28న, రాజమహేంద్రవరంలోని వేద శాస్త్ర పరిషత్‌లో సెప్టెంబర్ 4న, పిఠాపురంలో సెప్టెంబర్ 6న నిర్వహించిన సామవేద పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు ప్రథమ శ్రేణిలో నిలిచారు. కే. లక్ష్మీ నరసింహ శర్మ, ఎస్. వినాయక శర్మ, ఎం. షణ్ముఖ శర్మ, ఆర్. షణ్ముఖ శర్మ, ఏ. సత్యనారాయణ శాస్త్రి ఈ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత విద్యను అభ్యసించి వేద విద్యలో నైపుణ్యం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వేద పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ వంశీ మోహన శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## శుద్ధీకరణపై అట్రాసిటీ కేసు పెట్టాలి: కాంగ్రెస్ ఎస్సీ విభాగం

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద దళితులు నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఆ ప్రాంతాన్ని గంగాజలం, పసుపు నీటితో శుద్ధీకరించారంటూ ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ ఎస్సీ విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ దుమాల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. దళితులు అడుగుపెట్టిన ప్రదేశాన్ని శుద్ధీకరించడం దళితుల పట్ల వివక్ష, అంటరానితనాన్ని ప్రదర్శించడమేనని వారు ఆరోపించారు. ఇటువంటి చర్యలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్, భాజపా దళితుల పట్ల వివక్ష చూపుతున్నాయని నాయకులు విమర్శించారు. దళితుల హక్కులు, ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బడుగు రాజేందర్, బొల్లారపు గిరిధర్, రిటైర్డ్ ఎంఈవో మద్దెల నారాయణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు నక్క అశోక్, కంటే అంజయ్య, కోలేపాక మల్లేష్, కడమండ కమలాకర్, గజ్జెల రాజు, కట్కూరి సురేష్, నక్క మణితేజ, నక్క నిఖిల్‌తేజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో భక్తుల అనూహ్య రద్దీ

**శ్రీవారి దర్శనానికి 24 గంటల సమయం**

తిరుమల, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): తిరుమలలో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుతం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 24 గంటల సమయం పడుతోంది. సెప్టెంబర్ 12 నుంచి 14 వరకు వరుస సెలవులు ఉండటంతో రానున్న రోజుల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది. భక్తుల రద్దీ దృష్ట్యా సెప్టెంబర్ 13న ఆదివారం నిర్వహించాల్సిన వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 12న శనివారం సిఫార్సు లేఖలను స్వీకరించబోమని స్పష్టం చేసింది. రద్దు చేసిన వీఐపీ బ్రేక్ దర్శన సమయాన్ని సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు వినియోగించనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని భక్తులు గమనించి టీటీడీకి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



## మొక్కలు నాటి.. పచ్చదనం పెంచాలి

**అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వన మహోత్సవం**

రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): సిరిసిల్ల అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. శంకర్ అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కళాశాల ఆవరణను పచ్చదనంతో, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గన్నేరు, మందార, దేవకాంచనం, క్రోటన్ తదితర మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మార్కొండ శకుంతల, డాక్టర్ కె. శారద, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఎం. శోభారాణి, డాక్టర్ ఏ. ప్రసాద్, డాక్టర్ ఎస్. కృష్ణ ప్రసాద్, జి. శ్రీధర్‌రావు, జె. నర్సయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## రోడ్డెక్కేలా విద్యుత్తు స్తంభాలు!



మల్యాల, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతపూర్‌లో గోదాముల నుంచి కొండగట్టు ప్రాంతానికి వెళ్లే రహదారి పక్కన కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్తు స్తంభాలపై ఈగల్ యూత్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుకు అత్యంత సమీపంలో స్తంభాలను ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు, పాదచారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్తులో రహదారి విస్తరణ చేపట్టినప్పుడు కూడా ఈ స్తంభాలు ఆటంకంగా మారే అవకాశం ఉందని వెల్లడించారు. సంబంధిత అధికారులు వెంటనే స్థల పరిశీలన చేసి, స్తంభాల ఏర్పాటు నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో పరిశీలించాలని కోరారు. ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తిస్తే స్తంభాలను రోడ్డుకు దూరంగా సురక్షిత ప్రాంతానికి మార్చాలని గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌ను కోరారు.



## చాకలి ఐలమ్మకు ఘన నివాళి

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణ జిల్లాల బీసీ సాధికారిత సంఘం ఇన్‌చార్జి పొలాస నరేందర్ మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. దేశ్‌ముఖ్‌లు, జమీందార్లు, పటేల్, పట్వారీలు, జాగీర్దార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఐలమ్మ ధైర్యంగా పోరాడారని తెలిపారు. భర్త నర్సయ్య, ఇద్దరు కుమారులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించినా ఆమె వెనుకడుగు వేయలేదన్నారు. మహిళలకు, అణగారిన వర్గాలకు ఐలమ్మ స్ఫూర్తిదాయకంగా నిలిచారని పేర్కొన్నారు. ఆమె ఆశయాలు, ఆలోచనలు నేటికీ ప్రజలకు మార్గదర్శకంగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో బీసీ సాధికారిత సంఘం నాయకులు లింగంపల్లి దేవయ్య, కనపర్తి సుధాకర్, పిన్నింటి హన్మాండ్లు, వాసం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## అధికారికంగా విమోచన దినోత్సవం

### బీజేపీ వేములవాడ శాఖ డిమాండ్

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ వేములవాడ పట్టణ శాఖ డిమాండ్ చేసింది. పట్టణంలోని పద్మశాలి భవన్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను పక్కదోవ పట్టించేందుకు రాజకీయ డ్రామాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రజలు ఆలోచించి బీజేపీని ఎన్నుకునే రోజులు ముందున్నాయని అన్నారు. సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంలో రెండు పార్టీలు విఫలమయ్యాయని ఆరోపించారు. అనంతరం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేగుల శ్రీకాంత్, పిన్నింటి హనుమాన్లు, గుడిసె మనోజ్, బిల్లా కృష్ణ, కటకం శ్రీనివాస్, జవ్వాజి రాజశేఖర్, సాయి కృష్ణ, అన్నం నరసయ్య, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



## శాస్త్రీయ సాగుతో ఎల్‌నినోను ఎదుర్కొందాం

### ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావం పట్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, శాస్త్రీయ సాగు పద్ధతులతో ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవచ్చని ఆత్మ కమిటీ వేములవాడ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి అన్నారు. వేములవాడ మూడో వార్డు లక్ష్మీపురంలో ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, టీఆర్వీకే జిల్లా సమన్వయకర్త సాయి కుమార్, ఎంఏఓ సాయి కిరణ్, పశు వైద్యాధికారి రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షుడు అంజయ్య, కౌన్సిలర్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు వరి, పత్తి పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ, వాతావరణ మార్పుల ప్రభావంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించడం వల్ల నేల సారం దెబ్బతింటుందని ముకుందరెడ్డి తెలిపారు. యూరియాను సక్రమంగా వినియోగించడంతో పాటు నానో యూరియా వాడకాన్ని పెంచాలని సూచించారు. కూలీల కొరతను అధిగమించేందుకు యంత్ర పరికరాలను వినియోగించుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అధికారులు, నాయకులు పత్తి పంట పొలాలను పరిశీలించారు. పంటలో సమస్యలు కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ముకుందరెడ్డి సూచించారు.

## రాజన్న ఆలయానికి మహారాష్ట్ర భక్తుడి విరాళం

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 10 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి, ఆలయ విస్తరణ పనులకు మహారాష్ట్రకు చెందిన భక్తుడు రూ.51,111 విరాళంగా అందజేశారు. మహారాష్ట్రలోని పర్భణికి చెందిన మనోజ్ ప్రకాష్‌రావు ఈ మొత్తాన్ని ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో అకౌంట్ అడ్వైజర్ ఆగమరావుకు అందజేశారు. అనంతరం ఆయన శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన దాతను ఆలయ వర్గాలు అభినందించాయి.




# బ్రిక్స్ సదస్సుకు సర్వం సిద్ధం

## రేపు, ఎల్లుండి శిఖరాగ్ర సమావేశం.. హాజరుకానున్న పుతిన్, జిన్‌పింగ్

### 15,000 మంది పోలీసులతో భద్రత

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని న్యూఢిల్లీ సర్వ సన్నద్ధమైంది. ఈ కీలక కార్యక్రమానికి భారత్ సిద్ధంగా ఉందని, ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. సెప్టెంబర్ 12–13 తేదీల్లో జరిగే ఈ 18వ బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీలోని భారత్ మండపం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ మేరకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ప్రపంచ నేతలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన భారత్ మండపం వీడియోను షేర్ చేస్తూ, "బ్రిక్స్ 2026కు సర్వం సిద్ధం!" అని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సహా పలువురు సభ్య, భాగస్వామ్య, ఆహ్వానిత దేశాల నేతలు ఢిల్లీకి రానున్నారు. 2026 సంవత్సరానికి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారం, పునరుత్థానం కోసం నిర్మాణం' అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తోంది. "మానవత్వానికే ప్రథమ ప్రాధాన్యం" అనే ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. అంతర్గత సహకారాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, పరస్పర ప్రాధాన్యత ఉన్న ప్రపంచ, ప్రాంతీయ అంశాలపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. సదస్సు నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, ఇతర ఏజెన్సీలతో కలిసి రాజధానిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 15,000 మంది పోలీస్ సిబ్బంది, 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. వీవీఐపీల రాకపోకల కారణంగా పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ప్రజలకు ముందుగానే సూచనలు జారీ చేశారు. భారత్ బ్రిక్స్ కూటమికి వ్యవస్థాపక సభ్యదేశం. 2012, 2016, 2021లో కూడా భారత్ అధ్యక్షత వహించింది. ఇప్పుడు నాలుగోసారి ఈ బాధ్యతను స్వీకరించింది. 2026తో బ్రిక్స్ కూటమి ఏర్పడి 20 ఏళ్లు పూర్తి కావడం మరో విశేషం.




ఈ ఏడాది జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి భారత్ దాదాపు 350కి పైగా సమావేశాలు, ఉన్నత స్థాయి కార్యక్రమాలను నిర్వహించి కూటమి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసిందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

### బ్రిక్స్‌తో ఏం ఫైదా?: చిదంబరం

బ్రిక్స్ సదస్సు వల్ల భారత్‌కు ఒరిగిందేంటని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ప్రశ్నించారు. అంతేకాదు, గత మూడు సమావేశాల వల్ల చెప్పుకోదగ్గ ఫలితాలు ఏమీ రాలేదని అభిప్రాయపడ్డారు. భారత్ ప్రస్తుతం బ్రిక్స్‌తో పాటు సాంఘై సహకార సంస్థ, జీ20, క్వాడ్‌లో సభ్య దేశంగా ఉందని గుర్తు చేశారు. వీటి వల్ల దేశానికి కలుగుతున్న ప్రయోజనాలేంటని నిలదీశారు. అయితే, గతంలో బ్రిక్స్ సదస్సుల వల్ల కొన్ని స్పష్టమైన ప్రయోజనాలు చేకూరాయని చెప్పారు. చిదంబరం ప్రశ్నకు అధికార బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్‌కు విదేశాంగ విధానం, దౌత్యంపై అవగాహన ఉందా..? అంటూ బీజేపీ నేత నళిన్ కోహ్లీ ప్రశ్నించారు. కాంగ్రెస్ దౌత్యం అంటే కేవలం లాభనష్టాల కోణంలోనే చూస్తోందా..? అని ప్రశ్నించారు. కీలకమైన అంతర్జాతీయ కార్యక్రమంపై కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ తన హయాంలో పాకిస్థాన్‌ను ఉగ్రవాద బాధితురాలిగా అభివర్ణించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ అది నిజానికి ఉగ్రవాదానికి పాల్పడే దేశం అని కోహ్లీ వ్యాఖ్యానించారు.



## భారత్ వద్ద 190 అణు వార్‌హెడ్స్

### అమెరికాకు చెందిన ఎఫ్ఏఎస్ సంస్థ వెల్లడి

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో అన్ని దేశాలు తమ సైనిక, రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటున్నాయి. ముఖ్యంగా అణ్వాయుధ సామర్థ్యాన్నిమరింతగా పెంచుకుంటున్నాయి. ఈ విషయంలో మన దేశం కూడా ముందుంది. చైనా, పాకిస్థాన్ వంటి పొరుగు దేశాలతో పొంచి ఉన్న ముప్పు నేపథ్యంలో భారత్ తన అణుశక్తి సామర్థ్యాన్ని భారీగా పెంచుకున్నట్లు అమెరికాకు చెందిన ఓ సంస్థ నివేదించింది. ప్రస్తుతం భారత్ వద్ద దాదాపు 190 అణు వార్‌హెడ్‌లు ఉన్నట్లు అంచనా వేసింది. అమెరికాకు చెందిన 'ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్' సంస్థ ఓపెన్ సోర్సెస్, వాణిజ్య ఉపగ్రహ చిత్రాలు, ప్రభుత్వ అధికారిక డేటాను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించింది. "భారత్ అణు సామర్థ్యం గల డెలివరీ ఫోర్స్ నిర్మాణం, దాని వ్యూహానికి సంబంధించి అందుబాటులో ఉన్న బహిరంగ సమాచారం ఆధారంగా.. భారత్ సుమారు 190 అణు వార్‌హెడ్‌లను ఉత్పత్తి చేసి ఉంటుందని మేము అంచనా వేస్తున్నాము" అని ఎఫ్ఏఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హన్స్ క్రిస్టెన్సెన్ తెలిపారు. వీటిలో 160కి పైగా అణ్వాయుధాలు తక్షణమే ప్రయోగించగల లాంచర్ల కోసం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మిగిలిన 30 కొత్తగా తయారవుతున్న క్షిపణుల కోసం ఉత్పత్తి దశలో ఉన్నట్లు వెల్లడించారు. కాగా, గతేడాది భారత్ వద్ద 180 అణ్వాయుధాలు ఉన్న విషయం తెలిసిందే. ఈ ఏడాదికి ఆ సంఖ్య 190కి చేరింది. గాలి, నేల, సముద్రం.. మూడు మార్గాల ద్వారా అణు ఆయుధాలను ప్రయోగించే వ్యవస్థలను భారత్ వేగంగా అభివృద్ధి చేస్తోందని హన్స్ క్రిస్టెన్సెన్ చెప్పారు. 2026 ప్రారంభం నాటికి భారత్ వద్ద సుమారు 730 కిలోల వెపన్-గ్రేడ్ ప్లుటోనియం ఉన్నట్లు అంచనా వేశారు. ఒక్కో వార్‌హెడ్‌కు 4 కిలోల ప్లుటోనియం అవసరమైతే, ఈ నిల్వలతో 140 నుండి 225 వార్‌హెడ్లను తయారు చేయవచ్చని వివరించారు. అయితే తన వద్ద ఉన్న ప్లుటోనియం మొత్తాన్ని భారత్ కేవలం ఆయుధాలకే వాడకుండా, భవిష్యత్ అవసరాల కోసం, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం కొంత భాగాన్ని రిజర్వ్‌గా ఉంచుకునే అవకాశం ఉందని హాన్స్ క్రిస్టెన్సెన్ అభిప్రాయపడ్డారు.



## లోథల్‌లో టీజీ మీడియా ప్రతినిధుల పర్యటన

### అభివృద్ధి, వారసత్వ పరిరక్షణపై ప్రత్యక్ష అవగాహన

### హరప్పా నాగరికత విశేషాల పరిశీలన

హైదరాబాద్, సెప్టెంబర్ 10 : గుజరాత్‌లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యటనలో భాగంగా తెలంగాణకు చెందిన మీడియా ప్రతినిధుల బృందం బుధవారం ధోలేరా గ్రీన్‌ఫీల్డ్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ, చారిత్రక లోథల్ పురావస్తు ప్రదేశాన్ని సందర్శించింది. మొదట ధోలేరా గ్రీన్‌ఫీల్డ్ పారిశ్రామిక స్మార్ట్ సిటీని సందర్శించిన మీడియా బృందానికి సమగ్ర ప్రణాళిక, పరిశ్రమలకు సిద్ధంగా ఉండే మౌలిక వసతులు, ప్రధాన మౌలిక సదుపాయాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై అధికారులు వివరించారు. ధోలేరా పారిశ్రామిక నగర అభివృద్ధి సంస్థ సంయుక్త నిర్వహణ సంచాలకుడు రుషిన్ భట్, మార్కెటింగ్ మేనేజర్ అదితి గోయక్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. స్మార్ట్ ప్రజా సదుపాయాలు, రవాణా–సరుకు రవాణా అనుసంధానం, ఈ ప్రాంతంలో అందుబాటులోకి వస్తున్న పెట్టుబడి అవకాశాలపై వివరించారు. అనంతరం మీడియా ప్రతినిధుల బృందం లోథల్ పురావస్తు ప్రదేశాన్ని సందర్శించింది. సుమారు 4,500 ఏళ్ల క్రితం నాటి సింధు లోయ నాగరికతకు చెందిన ప్రముఖ ఆవాసాల్లో లోథల్ ఒకటి. అక్కడ తవ్వకాల ద్వారా వెలుగులోకి వచ్చిన పురాతన రేవు, గోదాం సముదాయాలు, పట్టణ మురుగునీటి పారుదల వ్యవస్థలను బృందం పరిశీలించింది. హరప్పా నాగరికతలోని ఇంజినీరింగ్ నైపుణ్యం, పట్టణ నిర్మాణ ప్రణాళిక, సముద్ర వాణిజ్య విధానాలపై అవగాహన పొందింది. లోథల్‌లో కేంద్ర నౌకాశ్రయ, నౌకాయాన, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాగర్‌మాల కార్యక్రమం కింద అభివృద్ధి చేస్తున్న జాతీయ సముద్ర వారసత్వ సముదాయం నిర్మాణ పనులను కూడా మీడియా బృందం పరిశీలించింది. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,500 కోట్ల అంచనా వ్యయంతో ఈ సముదాయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. జాతీయ సముద్ర వారసత్వ సముదాయంలోని ప్రధాన ఆకర్షణలను అధికారులు మీడియా ప్రతినిధులకు వివరించారు. భారతదేశానికి ఉన్న 4,500 ఏళ్ల సముద్ర వాణిజ్య, నౌకాయాన వారసత్వాన్ని ప్రతిబింబించే సముద్ర ప్రదర్శనశాలలు, పురాతన లోథల్ నగరానికి జీవిత పరిమాణంలో రూపొందించే నమూనా, దీపస్తంభాల మ్యూజియం, 5డీ డోమ్ థియేటర్, జల ప్రదర్శనశాల వంటి అనేక ఆకర్షణలు ఇందులో ఉండనున్నాయి. తీర ప్రాంత రాష్ట్రాల ప్రత్యేక ప్రదర్శనశాలలు, వివిధ అంశాల ఆధారంగా రూపొందించే ఉద్యానవనాలు, పర్యావరణహిత రవాణా సదుపాయాలు, సందర్శకుల వసతి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. ధోలేరా ఆధునిక పారిశ్రామిక, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తుండగా.. లోథల్ భారతదేశపు ప్రాచీన నాగరికత, సముద్ర వాణిజ్య వారసత్వానికి అద్దం పడుతోందని అధికారులు పేర్కొన్నారు. అభివృద్ధి, చారిత్రక వారసత్వ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేసే విధానాన్ని ఈ పర్యటన ద్వారా మీడియా ప్రతినిధులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, వారసత్వ పరిరక్షణ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించే అవకాశం ఈ పర్యటన ద్వారా జర్నలిస్టులకు లభించింది. ప్రధానమంత్రి మోదీ ప్రతిపాదిస్తున్న 'వికాస్ భీ, విరాసత్ భీ' భావనకు అనుగుణంగా అభివృద్ధి, వారసత్వ పరిరక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తున్న తీరును ఈ పర్యటన చాటిచెప్పింది.




లవ్లీ చిత్రం







## టొరంటో..
# తారల తళుకులు!




**అట్టహాసంగా అంతర్జాతీయ చలనచిత్రోత్సవం.. ఈ నెల 20 వరకు అంగరంగ వైభవంగా వేడుకలు**

ఉత్తర అమెరికాలోనే అతిపెద్ద చలనచిత్రోత్సవంగా పేరుగాంచిన టొరంటో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం 51వ ఎడిషన్ వైభవంగా ప్రారంభమైంది. గురువారం నుంచి సెప్టెంబర్ 20 వరకు సాగే ఈ వేడుకల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 200కి పైగా సినిమాలు ప్రదర్శితం కానున్నాయి. వెనిస్, టెల్లురైడ్ ఫిల్మ్ ఫెస్టివల్స్ ముగిసిన వెంటనే జరుగుతున్న సినీ పండుగకు ప్రపంచవ్యాప్తంగా వందలాది మంది సినీ ప్రియులు, విమర్శకులు, మీడియా ప్రతినిధులు పోటెత్తారు. రెడ్ కార్పెట్ ఈవెంట్లు, గ్రాండ్ ప్రీమియర్లతో టొరంటో నగరం కోలాహలంగా మారింది. ఈ సారి ఫెస్టివల్‌లో ప్రధానంగా అనూహ్య విజయం సాధించిన వ్యక్తుల, పోరాట యోధుల జీవిత కథల ఆధారంగా తెరకెక్కిన చిత్రాలకు ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. ప్రముఖ హాలీవుడ్ నటుడు సిల్వెస్టర్ స్టాలోన్ రాకీ సినిమాను రూపొందించడానికి పడిన కష్టాలు, హాలీవుడ్‌లో ఆయన సాధించిన విజయం నేపథ్యంలో నిర్మించిన ఐ ప్లే రాకీ చిత్రం ప్రపంచ ప్రీమియర్ ఫెస్టివల్‌లోనే ప్రదర్శితమవుతోంది. పీటర్ ఫారెల్లీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ సారి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దివ్యాంగుల హక్కుల కోసం పోరాడిన ప్రముఖ అమెరికన్ సామాజిక కార్యకర్త జూడీ హ్యూమన్ జీవిత ఆధారంగా నిర్మించిన బీయింగ్ హ్యూమన్ చిత్రంతో చలనచిత్రోత్సవం అధికారికంగా ప్రారంభమైంది. ఆస్కార్ గ్రహీత సీన్ హెడర్ దర్శకత్వంలో తెరకెక్కిన బయోపిక్‌లో రూత్ మేడ్లీ ప్రధాన పాత్ర పోషించగా, మార్క్ రుఫాలో కీలక పాత్రలో నటించారు. దీంతో పాటు క్యూబెక్ లోని సాధారణ కుటుంబం నుంచి ఫార్ములా-1 రేసింగ్ దిగ్గజంగా ఎదిగిన కార్ రేసర్ గిల్లెస్ విల్నెవ్ జీవిత కథ ఆధారంగా రూపొందించిన విల్నెవ్: ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్ బయోపిక్ కూడా ప్రదర్శితమవుతోంది. ప్రముఖ కమేడియన్, దర్శకుడు క్రిస్ రాక్ తెరకెక్కించిన హాలీవుడ్ ఆకతాయిహాస్య చిత్రం మిస్టీ గ్రీన్ ఫెస్టివల్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కష్టాల్లో ఉన్న నటి తన కెరీర్‌ను తిరిగి నిర్మించుకునేందుకు చేసే ప్రయత్నాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. డానియల్ కలుయా, ఆడం డ్రైవర్, అన్నా కేండ్రిక్ వంటి ప్రముఖ తారలు ఇందులో నటించారు. వీటితో పాటు చిలీ మాజీ అధ్యక్షుడు సాల్వడార్ అల్లెండే పరిపాలన చివరి రోజుల్లో ఈస్టర్ ఐలాండ్ నేపథ్యంలో సాగే వైల్డ్ హార్స్ నైన్ థ్రిల్లర్ మూవీ ప్రదర్శనకు జాన్ మాల్కోవిచ్, శామ్ రాక్‌వెల్ వంటి దిగ్గజ నటులు హాజరవుతున్నారు. ఈ ఫెస్టివల్‌కు వచ్చిన ఇతర ప్రముఖ చిత్రాలలో అండ్రూ స్కాట్, ఒలీవియా కోల్మాన్ నటించిన ఎల్సినోర్, జెస్సీ ఐసన్‌బెర్గ్ డైరెక్ట్ చేసిన మ్యూజికల్ కామెడీ ది డిబ్యూ, క్రిమిన్ థ్రిల్లర్ నవలా రచయిత్రి పాట్రిషియా హైస్మిత్ కథతో హెలెన్ మిర్రెన్ నటించిన ఎ టాలెంట్ ఫర్ మర్డర్, జాక్ స్నైడర్ దర్శకత్వం వహించిన మైండ్-బెండింగ్ యాక్షన్ డ్రామా ది లాస్ట్ ఫోటోగ్రాఫ్ ముఖ్యమైనవి. రియల్ లైఫ్ దంపతులు జేవియర్ బార్డెమ్, పెనెలోప్ క్రూజ్ కలిసి నటించిన సైకలాజికల్ థ్రిల్లర్ బంకర్ చిత్రాన్ని కూడా ప్రదర్శిస్తున్నారు. హాటెస్ట్ పాప్ ఐకాన్, బ్లాక్‌పింక్ కే-పాప్ గ్రూప్ స్టార్ లిసా నటించిన ఆల్వేస్ లలిసా డాక్యుమెంటరీ ఈ ఫెస్టివల్ ద్వారా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఆమె సోలో మ్యూజిక్ కెరీర్ ప్రారంభం ది వైట్ లోటస్ షో ద్వారా నటిగా మారిన క్రమాన్ని డాక్యుమెంటరీలో ఆవిష్కరించారు.

# ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. న్యాయస్థానం గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఆయన ఉల్లంఘిస్తున్నారంటూ ప్రముఖ మ్యూజిక్ సంస్థ 'సరిగమ' దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఈ సందర్భంగా ఆదేశించింది. సరిగమ సంస్థ తాజాగా దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ఇళయరాజాపై తీవ్రమైన ఆరోపణలు చేసింది. తాము కాపీరైట్లు హక్కులు కలిగి ఉన్న పాటలను ఆయన వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని, తద్వారా గతంలో కోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా అతిక్రమిస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు ఇళయరాజాపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని విన్నవించింది. అంతేకాకుండా, ఆయన ఆస్తులను జప్తు చేసి, వాటి విక్రయం ద్వారా వచ్చిన సొమ్మును తమకు చెల్లించాలని కూడా పిటిషన్‌లో కోరింది. గతంలో ఇళయరాజా స్వరపరిచిన పలు చిత్రాల పాటలకు సంబంధించిన కాపీరైటు హక్కులు తమకే దక్కుతాయని, అయినప్పటికీ ఆయన ఆ హక్కులను క్లెయిమ్ చేస్తూ వాణిజ్యపరంగా వాడుకుంటున్నారని సరిగమ సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అప్పట్లో ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఈ వ్యవహారంపై స్టే విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, ఆ స్టే ఉత్తర్వులను ఇళయరాజా బేఖాతరు చేస్తున్నారని సరిగమ తాజాగా ఆరోపించింది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ఢిల్లీ హైకోర్టు, ఈ ఫిర్యాదుపై స్పందించాలని ఆదేశిస్తూ ఇళయరాజాకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## జీవితం చాలా చిన్నది: ప్రియాంక



కొందరు నటులు.. కొన్ని పాత్రలలో అరుదైన అభినివేశం, నట ప్రదర్శనతో అలరించి హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోతారు. ఇహలోకంలో లేకపోయినా వైవిధ్యమైన పాత్రలు, నటనతో ఎప్పటికీ ప్రేక్షకుల గుండెల్లో సజీవంగానే ఉంటారు. ఈ మాట టాలీవుడ్ సీనియర్ నటుడు, దివంగత నందమూరి హరికృష్ణ విషయంలో అక్షరాలా నిజమని మరోసారి రుజువైంది. తాజాగా గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసిన ఒక వీడియో నెట్టింట తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. హరికృష్ణ నటించిన మాస్ క్లాసిక్ సీతయ్య సినిమాలోని ఒక షార్ట్ వీడియో క్లిప్‌ను పీసీ షేర్ చేస్తూ.. "జీవితం చాలా చిన్నది, అనవసర వాదనలకు దిగకుండా ఇలా చేసి ముందుకు సాగండి" అని అర్థమొచ్చేలా ఇచ్చిన క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది. దీంతో నందమూరి అభిమానులు ప్రియాంక షేర్ చేసిన పోస్ట్‌ను రీ-షేర్ చేస్తూ హరికృష్ణకు దక్కిన గ్లోబల్ గౌరవంగా పండుగ చేసుకుంటున్నారు.



## ముంబై వీధుల్లో సమంత

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ఇటీవల ముంబైలోని బాంద్రా వీధుల్లో సందడి చేస్తూ కెమెరా కంటికి చిక్కింది. ఒక వీడియో షూట్ కోసం స్టూడియోకి విచ్చేసిన ఈ భామ, అత్యంత సాధారణమైన దుస్తుల్లోనూ తనదైన స్టైల్ మార్క్‌ను చూపిస్తూ అందరి దృష్టినీ ఆకర్షించింది. గ్లామరస్ అవుట్‌ఫిట్లే కాకుండా ఇలాంటి క్యాజువల్ వేర్‌లో కూడా సమంత ఎంతో హుందాగా, ఆకర్షణీయంగా కనిపించడంతో ఆమె పిక్స్, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

## సాహసం.. తారా సుతారియా!



బాలీవుడ్ నటి తారా సుతారియా ఇటీవలే యష్ సరసన టాక్సిక్ చిత్రంలో కనిపించిన సంగతి తెలిసిందే. తనదైన అందం, అద్భుత నటప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక టాక్సిక్కి టాక్ ఎలా ఉన్నా తారా సుతారియాకు మాత్రం సౌత్ లోను భీభత్సమైన ఫాలోయింగ్ పెరిగింది. అలాగే తారా సోషల్ మీడియాల్లోను జరంగా యాక్టివ్ గానే ఉంది. ఇటీవల తనను అతిగా తాకేలా ముందుకు వచ్చిన ఒక ఫోటోగ్రాఫర్ (పాపరాజ్జీ) కెమెరాను తోసివేసిన వీడియో సోషల్ మీడియాలో జోరుగా వైరల్ అవుతోంది. ముంబైలోని రెయినీ సీజన్ లో ఒక ప్రదేశంలో తారా వెళుతుండగా.. తనకు అత్యంత సమీపంలోకి వచ్చి ఫోటోలు తీయడానికి ప్రయత్నించిన ఒక ఫోటోగ్రాఫర్‌ను తారా ధైర్యంగా అడ్డుకుంది. అతడి కెమెరాను దూరంగా నెట్టేసే ప్రయత్నం చేసింది. ఈ సంఘటన సెలబ్రిటీల వ్యక్తిగత స్వేచ్ఛ - ప్రైవసీకి సంబంధించిన పరిమితులపై మరోసారి పెద్ద ఎత్తున చర్చకు తెర తీసింది.

## మన దారిని మనమే సెట్ చేసుకోవాలి

ఇండస్ట్రీలో ఛాన్సులు రావడం ఎంత ముఖ్యమో.. వచ్చిన అవకాశాలను యూజ్ చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. అయితే కొన్నిసార్లు మనకు ఎంత టాలెంట్ ఉన్నా ఛాన్సులు రావు. అలాంటి సమయంలో నిరాశ చెందకుండా మన



దారిని మనమే సెట్ చేసుకోవాలని స్టార్ యాంకర్, నటి, నిర్మాత ఉదయభాను అన్నారు. ఇతరులు మన స్టామినా డిసైడ్ చేయకూడదని.. మనపై మనకు నమ్మకం ఉండాలని సూచించారు. లేటెస్ట్ గా జరిగిన పంచనామా వెబ్ సిరీస్ ప్రెస్ మీట్ లో ఉదయభాను తన ఎక్స్పీరియెన్సెస్ ను షేర్ చేసుకున్నారు. "మీరు ఎప్పుడు ఏదైనా అనుకుంటే చాలా మంది క్వశ్చన్ మార్క్ తోనే చూస్తారు. మనం కచ్చితంగా చేస్తామని ఎవరూ అనుకోరు. చాలా మంది మనకు లిమిట్ గీస్తారు. కానీ మన సత్తా ఏంటో మనకు మాత్రమే తెలుసు. ఇతరులకు మన స్టామినా పూర్తిగా తెలియదు" అని ఆమె అన్నారు. జీవితంలో ఏదైనా ఛాన్స్ మిస్ అయినప్పుడు అక్కడే ఆగిపోకూడదని ఉదయభాను చెప్పారు. ఒక తలుపు మూసుకుపోతే.. అదే డోర్ ఎప్పుడు తెరుచుకుంటుందా అని ఎదురుచూడకుండా కొత్త తలుపును మనమే క్రియేట్ చేసుకోవాలని అన్నారు.







## ఆసియా కప్

# ఫైనల్‌కు భారత్

**సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో విజయం**

**అద్భుత హాఫ్ సెంచరీతో చెలరేగిన షఫాలీ వర్మ**

మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. దుబాయ్ వేదికగా జరిగిన సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ షఫాలీ వర్మ (64) అద్భుత హాఫ్ సెంచరీతో చెలరేగగా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది.

**150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. ఆది నుంచి క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. భారత బౌలర్ల ధాటికి బంగ్లా బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు.**

షోర్నా అక్తర్ (22లి) టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించగా, నందని శర్మ రెండు వికెట్లు పడగొట్టింది. దీంతో బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 109 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ విజయంతో టీమిండియా ఆసియా కప్ ఫైనల్‌లో అడుగుపెట్టింది. అంతకుముందు, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో భారత్ తొలుత బ్యాటింగ్ చేసింది. ఆరంభంలోనే స్మృతి మంధాన (2) వికెట్‌ను కోల్పోయినా, షఫాలీ వర్మ తనదైన శైలిలో బంగ్లా బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. కేవలం 40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 64 పరుగులు చేసి భారీ స్కోరుకు బాటలు వేసింది. ఆమెకు జతగా ప్రతిక రావల్ (20) రాణించింది. చివర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (24లి), రిచా ఘోష్ (21), దీప్తి శర్మ (13) వేగంగా పరుగులు చేయడంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగుల మంచి స్కోరును నమోదు చేసింది. రేపు (సెప్టెంబరు 11) జరిగే రెండో సెమీఫైనల్లో పాకిస్థాన్, శ్రీలంక తలపడనున్నాయి. ఈ మ్యాచ్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది.








## దులీప్ ట్రోఫీ విజేత..

# ఈస్ట్ జోన్

**13 ఏళ్ల నిరీక్షణకు తెర.. సౌత్ జోన్‌పై ఘన విజయం**

**మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంతో టైటిల్ కైవసం**

చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచింది. సౌత్ జోన్‌పై మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, 2012-13 సీజన్ తర్వాత మళ్లీ ప్రతిష్ఠాత్మకమైన ఈ ట్రోఫీని ముద్దాడింది.

**ఇది ఈస్ట్ జోన్‌కు మూడో దులీప్ ట్రోఫీ టైటిల్ కావడం విశేషం. ఆఖరి రోజు ఆట ప్రారంభమైన తర్వాత ఈస్ట్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. మహ్మద్ కౌనైన్ ఖురేషీ (116 నాటౌట్) తన కెరీర్‌లో తొలి ఫస్ట్ క్లాస్ సెంచరీతో అదరగొట్టగా, అనుకుల్ రాయ్ (64) అర్ధశతకంతో రాణించాడు.**

99.2 ఓవర్లలో 7 వికెట్లకు 388 పరుగులు చేసిన తర్వాత ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. డిక్లరేషన్ ప్రకటించిన వెంటనే, ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్ ఆటగాళ్లు విజయోత్సవాల్లో మునిగిపోయారు. వాస్తవానికి ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లోనే ఈస్ట్ జోన్ తన పట్టు బిగించింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (270) అద్భుతమైన డబుల్ సెంచరీకి, కుమార్ కుశాగ్ర (101) శతకం తోడవడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీనికి సమాధానంగా సౌత్ జోన్ 336 పరుగులకే ఆలౌట్ కావడంతో మ్యాచ్ ఫలితం దాదాపుగా ఖరారైంది. ఇషాన్ కిషన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులు చేసి, మ్యాచ్ మొత్తంలో 350 పరుగులతో అగ్రస్థానంలో నిలిచాడు. ఈస్ట్ జోన్ విజయంలో ఝార్ఖండ్‌కు చెందిన యువ ఆటగాళ్లు కీలక పాత్ర పోషించారు. కుశాగ్రతో పాటు తన అరంగేట్ర దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లోనే శిఖర్ మోహన్ 85 పరుగులతో ఆకట్టుకున్నాడు. గత దేశవాళీ సీజన్‌లో ప్రదర్శించిన ఫామ్‌ను అతను కొనసాగించాడు. ఈ ముగ్గురి ప్రదర్శనతో ఈస్ట్ జోన్ టైటిల్ విజయంలో ఝార్ఖండ్ ఆటగాళ్ల ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఆఖరి రోజు ఉదయం ఖురేషీ, అనుకుల్ రాయ్ ఏడో వికెట్‌కు 150 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలోనే స్లో ఓవర్ రేట్ కారణంగా 73వ ఓవర్‌లో సౌత్ జోన్‌కు అంపైర్లు 5 పరుగుల పెనాల్టీ విధించారు. 96వ ఓవర్లో పేసర్ సీవీ మిలింద్ బౌలింగ్‌లో రెండు పరుగులు తీసి ఖురేషీ తన తొలి ఫస్ట్ క్లాస్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. చెపాక్‌లోని తీవ్రమైన తేమ, ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా సౌత్ జోన్ పేసర్ మహ్మద్ సిరాజ్ తన పోరాట పటిమను ప్రదర్శించాడు. మ్యాచ్ ఫలితం తేలిపోయినప్పటికీ, ఏకధాటిగా తొమ్మిది ఓవర్లు బౌలింగ్ చేసి ఆకట్టుకున్నాడు. ఇషాన్ కిషన్ డిక్లరేషన్ ప్రకటించిన వెంటనే, అంపైర్లు బెయిల్స్‌ను తొలగించి మ్యాచ్‌ను ముగించారు. దీంతో ఈస్ట్ జోన్ ఆటగాళ్లు మైదానంలోనే సంబరాలు చేసుకున్నారు. ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ ఒక స్టంప్‌ను చేతిలో పట్టుకుని డ్యాన్స్ చేస్తూ ప్రేక్షకులకు అభివాదం చేశారు.

### ఆకలి పెరిగింది: ఇషాన్ కిషన్

దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ 13 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఫైనల్లో సౌత్ జోన్‌పై ఆధిపత్యం ప్రదర్శించి టైటిల్ సొంతం చేసుకుంది. ఈ విజయానికి జట్టు సమష్టి కృషి, ఐక్యతే కారణమని కెప్టెన్ ఇషాన్ కిషన్ చెప్పాడు. "ఈ విజయం మా అందరిదీ. ఒకరికొకరం అండగా నిలిచాం. అదే ఈ జట్టు బలం. నాయకుడిగా నేను కూడా నా వంతు బాగానే చేశాననుకుంటా" అంటూ ఇషాన్ నవ్వుతూ చెప్పాడు. అయితే విజయంతో ప్రయాణం ముగియదని అన్నాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని విభాగాల్లో ఇంకా మెరుగుపడాల్సి ఉందని తెలిపాడు. ఫైనల్లో ఇషాన్ కిషన్ కీలక పాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 270 పరుగులతో భారీ ఇన్నింగ్స్ ఆడాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ ఆధిక్యంతో ఈస్ట్ జోన్‌కు విజయం ఖాయమైంది. దీంతో 2012-13 సీజన్ తర్వాత తొలిసారి దులీప్ ట్రోఫీని గెలుచుకుంది. జాతీయ జట్టుకు దూరంగా ఉన్న సమయంలో తనలో చాలా మార్పు వచ్చిందని ఇషాన్ చెప్పాడు. ఇప్పుడు మరింత ప్రశాంతంగా ఉంటున్నానని, పరిస్థితులను బాగా అర్థం చేసుకుంటున్నానని చెప్పాడు. జట్టు కోసం ఆడాలనే ఆకలి తనలో మరింత పెరిగిందన్నాడు. జట్టు కోసం ఆడడం, టైటిల్ గెలవడమే ఇప్పుడు తన లక్ష్యమని స్పష్టం చేశాడు. కెప్టెన్‌గా ఇషాన్‌కు ఇది రెండో దేశవాళీ టైటిల్. 2025-26 సీజన్‌లో సొంత రాష్ట్రం ఝార్ఖండ్‌కు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ అందించాడు.



## బ్యాట్ నాకు భావోద్వేగం: సచిన్

క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ తన క్రీడా జీవితంలోని మధుర జ్ఞాపకాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. తన విజయాల్లో కీలక పాత్ర పోషించిన క్రికెట్ బ్యాట్‌తో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. బ్యాట్ అనేది తనకు కేవలం ఒక క్రీడా పరికరం మాత్రమే కాదని పేర్కొన్నాడు. "నా దృష్టిలో బ్యాట్ అనేది కేవలం ఒక పరికరం కాదు. దానిని చేతుల్లోకి తీసుకున్నప్పుడు ఎలాంటి అనుభూతి కలుగుతుందో నాకు స్పష్టంగా తెలుసు. అందుకే అతి చిన్న అంశాలపై కూడా నేను ప్రత్యేక శ్రద్ధ వహించేవాడిని" అని సచిన్ తన పోస్టులో పేర్కొన్నాడు. అవసరమైనప్పుడు తన వద్ద ఉన్న కార్పెంటరీ కిట్‌ను బయటకు తీసి, బ్యాట్‌కు స్వయంగా మెరుగులు దిద్దుకునేవాడినని గుర్తుచేసుకున్నాడు. తనకు నచ్చిన ఆకృతి, సరైన పట్టు లభించే వరకు దానిపై స్వయంగా పని చేసేవాడినని వివరించాడు. ఈ క్రమంలో గడిపిన చిన్న చిన్న క్షణాలు తనకు ఎంతో మధురంగా గుర్తున్నాయని సచిన్ తెలిపాడు. "నిజానికి ఆ జ్ఞాపకాలు కేవలం బ్యాట్‌కు సంబంధించినవి మాత్రమే కాదు, ఆ ప్రక్రియ ద్వారా ఆ బ్యాట్‌ను నా సొంతం చేసుకోవడానికి సంబంధించినవి" అంటూ తన పోస్టును ముగించాడు.

## ధోనీ వికెట్ తీశా..

## ఆ ఆనందమే వేరు: కార్తిక్ చద్దా

ఐపీఎల్ లాంటి మెగా టోర్నీలో దిగ్గజ ఆటగాళ్లతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడమే ఒక యువ క్రికెటర్‌కు గొప్ప అనుభూతి. అలాంటిది, ఏకంగా 'కెప్టెన్ కూల్' మహేంద్ర సింగ్ ధోనీ వికెట్ తీస్తే ఆ ఆనందాన్ని మాటల్లో వర్ణించలేం. జలంధర్‌కు చెందిన యువ లెగ్ స్పిన్నర్ కార్తిక్ చద్దా సరిగ్గా అలాంటి మధుర క్షణాన్నే ఆస్వాదించాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) జట్టుకు నెట్ బౌలర్‌గా సేవలందించిన కార్తిక్, చెపాక్‌లో జరిగిన ఒక ఇంట్రా-స్క్వాడ్ మ్యాచ్‌లో ధోనీని ఔట్



చేశాడు. ఆ సంఘటనే తనలో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపిందని అతను చెబుతున్నాడు. సీఎస్కే నుంచి పిలుపు వచ్చినప్పుడు మొదట నమ్మలేకపోయానని కార్తిక్ అన్నాడు. "సీఎస్కే క్యాంపులో చేరమని నాకు ఫోన్ వచ్చినప్పుడు, ఆ క్షణం నమ్మశక్యంగా అనిపించలేదు. అక్కడికి వెళ్లాక, ధోనీ భాయ్ లాంటి దిగ్గజంతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం నాకు చాలా పెద్ద విషయం" అని తెలిపాడు. జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేయడం, మ్యాచ్‌లు ఆడటం మొదలుపెట్టాక తనలో నమ్మకం పెరిగిందని చెప్పాడు. "జట్టులో అంతర్గతంగా నిర్వహించిన మ్యాచ్‌లలో నేను బాగా బౌలింగ్ చేశాను. అప్పుడే నేను ఈ స్థాయికి చెందినవాడినని నమ్మడం మొదలుపెట్టాను. నా ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది" అని వివరించాడు. ధోనీని ఔట్ చేసిన క్షణాన్ని గుర్తుచేసుకుంటూ, "ఒక ఇంట్రా-స్క్వాడ్ మ్యాచ్‌లో నేను నాలుగు వికెట్లు పడగొట్టాను. అందులో ధోనీ భాయ్ వికెట్ కూడా ఉంది. అది సాధారణ ప్రాక్టీస్ గేమే అయినా, ధోనీని ఔట్ చేయగలిగాను. ఆ మ్యాచ్‌లో నేను పరుగులు కూడా ఇచ్చాను, కానీ ధోనీ భాయ్‌ని ఔట్ చేసిన ఆనందమే వేరు" అని కార్తిక్ ఆనందంగా చెప్పాడు.




## 2027 వరల్డ్ కప్‌పై రోహిత్ కీలక వ్యాఖ్యలు

2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా? కొంతకాలంగా ఈ ప్రశ్నపై చర్చ జరుగుతోంది. దీనిపై రోహిత్ తాజాగా స్పందించాడు. అయితే తన నిర్ణయాన్ని మాత్రం స్పష్టంగా వెల్లడించలేదు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొన్న రోహిత్‌ను ఓ అభిమాని ఇదే విషయంపై ప్రశ్నించాడు. 2027 అక్టోబర్‌లో జరిగే ప్రపంచకప్‌లో ఆడతారా? అని అడిగాడు. దీనికి "2027 అక్టోబర్ చాలా దూరంలో ఉంది. అప్పటికి చూద్దాం" అని రోహిత్ బదులిచ్చాడు. దీంతో ప్రపంచకప్ ఆడే విషయంపై రోహిత్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టమైంది. రోహిత్ ఇప్పటికే టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2027 ప్రపంచకప్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

## మలి వయసులో..

## స్పిన్ మంత్రాంగం

**47 ఏళ్ల వయసులో ఇమ్రాన్ తాహిర్ అద్భుతం**

**ఐదు వికెట్లు తీసి రికార్డు సృష్టించిన వెటరన్**

వయసు కేవలం అంకె మాత్రమేనని, నైపుణ్యం, పట్టుదల ఉంటే ఎంత వయసైనా అడ్డంకి కాదని దక్షిణాఫ్రికా వెటరన్ స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్ మరోసారి నిరూపించాడు. 47 ఏళ్ల వయసులో టీ20 క్రికెట్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన చేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు. అతని సమకాలీన క్రికెటర్లు ఎప్పుడో రిటైర్మెంట్ ప్రకటించగా, తాహిర్ మాత్రం ఇప్పటికీ తన స్పిన్ మాయాజాలంతో అబ్బురపరుస్తూనే ఉన్నాడు. కరేబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)లో గయానా అమెజాన్ వారియర్స్ తరఫున ఆడుతున్న తాహిర్, సెయింట్ లూసియా కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 17 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు.



ఈవార్తలు
# ప్రజావాణి
శుక్రవారం 11-9-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు



నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# ‘22ఏ’కు ప్రభుత్వ సమాధానమేది?

ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన చట్టసభ.. రాజకీయ రగడలకు వేదికగా మారితే ప్రజాస్వామ్యం బలపడుతుందా? తెలంగాణ అసెంబ్లీ తాజా పరిణామాలు చూస్తే ఈ ప్రశ్న ప్రతి పౌరుడినీ వెంటాడుతోంది. ఒకవైపు వ్యక్తిగత విమర్శలు, పరస్పర ఆరోపణలు, నిరసనలు, సస్పెన్షన్లు.. మరోవైపు భూములు, ఉద్యోగాలు, రైతులు, నిరుద్యోగులు, సంక్షేమ పథకాల అమలు, ధరల భారం వంటి అసలు ప్రజా సమస్యలు. మరి ప్రజల గోడు ఎప్పుడు వినిపిస్తుంది? శాసనసభ అంటే అధికార పక్షం–ప్రతిపక్షం పరస్పరం తిట్టుకునే వేదిక కాదు. ప్రజలు తమ ఓటుతో పంపిన ప్రతినిధులు రాష్ట్ర భవిష్యత్తుపై చర్చించాల్సిన పవిత్ర స్థలం. కానీ సభలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అసలు ప్రజా సమస్యలు రాజకీయ శబ్దంలో కూరుకుపోతున్నాయన్న భావన కలుగుతోంది. తాజాగా సభలో తీవ్ర గందరగోళం, పరస్పర ఆరోపణలు, సభ్యుల సస్పెన్షన్ల వరకు పరిస్థితి వెళ్లింది. ఇదే సమయంలో వేలాది కుటుంబాలను నేరుగా ప్రభావితం చేస్తున్న 22ఏ భూముల సమస్య సభ ముందుంది. నిషేధిత జాబితాలో భూములు చేరడం, తొలగించడం, నిజమైన భూయజమానులు రిజిస్ట్రేషన్లు చేసుకోలేకపోవడం వంటి సమస్యలపై ప్రజల్లో ఆందోళన ఉంది. ప్రతిపక్షం న్యాయ విచారణ కోరుతోంది. ప్రభుత్వం మాత్రం చర్చకు సిద్ధమని చెబుతోంది. సెప్టెంబర్ 7న ఈ అంశంపై చర్చకు పట్టుబడుతూ బీజేపీ సభ్యులు ఆందోళన చేయడంతో సభ కొంతసేపు వాయిదా పడింది. ఇక్కడే అసలు ప్రశ్న. 22ఏ జాబితాలోకి భూములు ఎలా వచ్చాయి? ఎవరి నిర్ణయంతో వచ్చాయి? ఎన్ని భూములు వచ్చాయి? ఎన్ని తొలగించారు? ఏ ప్రాతిపదికన తొలగించారు? నిజమైన యజమానులకు ఎందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి? ప్రజలకు కావాల్సింది రాజకీయ ప్రకటనలు కాదు. స్పష్టమైన సమాధానాలు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టులో 22ఏ జాబితాలో పొరపాటుగా చేరిన భూముల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కోర్టు ఉత్తర్వులు ఒక సర్వే నంబర్‌లో కొంత భూమికే వర్తించినా మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల సమస్యలు వస్తున్నాయని ఆయన స్వయంగా పేర్కొన్నారు. అయితే ఆ హామీకి మించి ప్రజలకు కావాల్సింది కాలపరిమితితో కూడిన కార్యాచరణ. ఎంతకాలంలో సమస్య పరిష్కరిస్తారు? ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? ఏ అధికారుల స్థాయిలో నిర్ణయాలు నిలిచిపోయాయి? తప్పిదాలకు బాధ్యులెవరు? అక్రమంగా చేర్చినవారిపై ఏ చర్యలు తీసుకున్నారు?

# జీరో గ్రావిటీ: అక్షర శాస్త్రం

అణువుల ప్రపంచాన్ని వర్ణించాలంటే మామూలు భాష సరిపోదు, కవిత్వంలోలాగా చెప్పాలి అని ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త నీల్స్ బోర్ అన్నట్లు, అణువుల్ని, పరమాణువుల్ని, విశ్వాంతరాల్లోని దృగ్విషయాలని అవపోశన పట్టిన వ్యక్తి కవిత్వాన్ని తన భాషగా మార్చుకొని, కుల మతాలకతీతమైన ఆలోచనతో సమాజాన్ని మరో ఇల్లుగా భావిస్తే పుట్టుకొచ్చే అక్షర వర్ణపటాలే ఫిజిక్స్ అరుణ్ కుమార్ గారి భావాల కిరణపుంజం “జీరో గ్రావిటీ”.




అరుణ్ కుమార్ గారి ఆలోచనలు నక్షత్రాల వైపు చూస్తున్నా, లక్షల అక్షర నక్షత్రాలు తన హృదయ విశ్వాంతరాల్లోకి తొంగి చూస్తున్నాయి. అలా తొంగి చూసినప్పుడు కలిగే ఉద్వేగ దృగ్విషయాలే జీరో గ్రావిటీలోని భావాల అగ్నికణాలు! సుంకర గోపాలయ్య గారు అన్నట్లు శాస్త్రీయ దృక్పథంతో పాటు దేశభక్తి, పర్యావరణ స్పృహ, మానవతా విలువలు, సామాన్యుల హక్కుల కోసం పోరాటాల మేల్కొలుపే జీరో గ్రావిటీ. మన ప్రతిబింబాన్ని యథాతథంగా చూపించేది అద్దం. అలాంటి మనసుతోనే సమాజం అనే అద్దంలోంచి అవతలకి, ఇవతలకి పారదర్శకంగా చూడగలిగి, ఓ భారరహిత స్థితిలోనే తాను ఉంటూ ప్రపంచ బాధను చూసి ఎంతో బరువెక్కిన హృదయంతో తాను కవిత్వాన్ని రాశారు.

భయపు వరదల్లో బాల్యపు/
పరిమళాలు బక్కచిక్కి/
తుపాకుల మోతల మధ్య రాకెట్ల వర్షంలో తడుస్తున్నాయి/

పై పంక్తుల్లో సరళతతో పాటు ఎంతో భారత్వం కలిగి ఉన్నాయి. ఎంతో మథనం జరిగితే కానీ ఈ ఆలోచనలు పురుడు పోసుకోవు!

“సత్యం ఎప్పుడూ సరళతతోనే ఉంటుంది, గందరగోళంలో కాదు, ఆ సరళతే కవిత్వం” అన్న ఐజాక్ న్యూటన్ మాటలు మనకు అరుణ్ కుమార్ గారి రచనల్లో ద్యోతకమవుతాయి!

అనంతపు విశ్వపు/
రహస్యాల రహదారిపై/
మనిషి ఎప్పుడూ/
అలసిపోని బాటసారి/

..అలతి అలతి పదాలతోనే అత్యద్భుతంగా భావాల్ని పరావర్తనం చేసే గొప్ప శైలి అరుణ్ కుమార్ గారిది.

ఆధ్యాత్మికత, విజ్ఞానాల మేళవింపు

విజ్ఞానశాస్త్రం ఆధ్యాత్మికతకు వ్యతిరేకం కాదు; అదే అత్యంత గొప్ప ఆధ్యాత్మికతకు మూలం. కవిత్వం, సైన్సు కలిసే ఉంటాయి అన్న కార్ల్ సాగన్ మాటలు ‘భగవద్గీత’ కవితలో అచ్చుగుద్దినట్లు అరుణ్ కుమార్ గారి హృదయాన్ని ఆవిష్కరింపజేస్తాయి.

మార్పు అనివార్యం/
సత్యమే సమస్తం/
బంధాలన్నీ తాత్కాలికం/
పరిణామం ప్రకృతి ధర్మం/
మనిషిని మహాత్ముడిగా మార్చి/
అభినవ అర్జునుడిలా/
నిన్ను సృష్టించేది భగవద్గీత...

ఒక రచయిత స్థానాన్ని సాహితీ లోకంలో సుస్థిరం చేసేది శైలి, పదాల వాడుక, నవ్యత. వృత్తిరీత్యా భౌతిక శాస్త్ర అధ్యాపకులు కావడంతో కవిత్వంలోనూ ఆ పదాలను ఎంతో హృద్యంగా, పొందికతో రాయగలిగే దమ్ము అరుణ్ కుమార్ కలానికుంది.

గురువంటే మహా చైతన్యపు/
విలువల కవిత్వం/
గురువంటే అనంత శూన్యంలో అంతరిక్ష అక్షర విశ్వం/

ఈ పంక్తుల్లో పదాల వాడుక, భావాల నడక ఎంతో నవ్యతతో కొనసాగుతుంది.

..అరుణ్ కుమార్ తన కవిత్వంలో అమూర్త భావాల విత్తనాలు పాఠకుల, ప్రజల మదిలో నాటేందుకు మూర్త వస్తువుల్నే తీసుకున్నారు. ఈ ఆధునిక యుగంలో ఓ కొత్త టెక్నిక్ ని సాహిత్యంలో ఉపయోగించారు.

నా అక్షర శాంతి వికిరణాలు/
సామాన్యుని హక్కుల/
స్వర దర్పణ స్వేచ్ఛా ప్రతిబింబాలు/

పై పంక్తుల్లో అనవసరమైన పదాడంబరత అస్సలు లేకుండా ఒక్క పదం నుండి వేల ఆలోచనలు పుట్టుకొచ్చేలా కవిత్వీకరించడం అరుణ్ కుమార్ గారికి కొట్టిన పిండి. దీన్నే వర్టెక్స్ ఎఫెక్ట్ అని ఎర్రా పౌండ్ అనే సాహితీ విమర్శకుడు అన్నాడు. తన జీరో గ్రావిటీలో పాఠకుల హృదయాలను తన భావుకత గురుత్వాకర్షణతో లాగి పడేస్తాడు మన అరుణ్ కుమార్.

సూర్యుడు లేని ఉదయం అన్న కవితలో
కాలం కరిగిపోయి కొవ్వొత్తిలా మారి/
కలాం జీవన గమనానికి/
సెల్యూట్ చేస్తూ/
నా త్రివర్ణ పతాక నేత్రంలో/
జనగణమన పాడుతుంటే/
తూర్పు సందుల్లో సూర్యుడు కాదు..!/
నేడు అబ్దుల్ కలాం ఉదయించారు/
అని అంటారు.

అందరి మనసులో ఉన్న సాధారణ ఆలోచనే, ఎవరూ ఇంతవరకు చెప్పనంత అందంగా, గుర్తుండిపోయేలా చెప్పడమే కవిత్వం. కొత్త ఆలోచన అవసరం లేదు, చెప్పే తీరు కొత్తగా ఉండాలి అని అలెగ్జాండర్ పోప్ అన్నట్లు –

నేనంతా/
నాలో అంతా నువ్వయ్యాక/
గణితం నా నేస్తమై/
భౌతిక శాస్త్రం నా ఉద్యమమై/
వన్ ప్లస్ వన్ అనంతంలో/
ఒకటే అయ్యింది ఓ వింతలా/

ఇలా ఓ సాధారణ భావాన్ని కొత్తగా, హత్తుకునేలా అరుణ్ కుమార్ రుజువు చేశారు. కవికి దేశంపై, సమాజంపై, ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలపై ఎరుక ఉందని తెలియజేస్తాయి. తన కవిత్వంలో పచ్చని చిగుళ్లనే కాదు, ఎండిన బీళ్లను, వాడిన బ్రతుకు ముళ్లను సైతం స్పృశించి, ఆవేశాగ్నిని, ఆశావాద దృక్పథాన్ని అక్షరబద్ధం చేసి పాఠకునిచే ఏకబిగిన చదివించేలా ఉంది ఫిజిక్స్ అరుణ్ కుమార్ గారి జీరో గ్రావిటీ. ఇలాంటి మరిన్ని ఆలోచనల ధారలు ప్రతి పాఠకుని హృదయంలో ప్రతిధ్వనించి సమాజాన్ని చైతన్యీకరించాలని పాఠక లోకం ఎదురు చూస్తుందనడంలో అతిశయోక్తి లేదు. కాళోజీ అన్నట్లు “అక్షర రూపం దాల్చిన సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక” అలాగే అరుణ్ కుమార్ కలం అక్షరీకరించిన ఆలోచనల పరంపర లక్షల మెదళ్లను కదిలించి పురోగమనం వైపు తీసుకువెళ్తుందని ఆకాంక్షిస్తున్నాను.

(ప్రతులకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు 9394749536)




తలగాపు ధనుంజయ రావు,
కవి, పుస్తక సమీక్షకులు
పలాస(శ్రీకాకుళం), ఆంధ్రప్రదేశ్
7036229121.


ప్రజా సంక్షేమం పేరుతో ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలను మెరుగుపరచేదిగా ఉండాలి. కానీ తెలంగాణలో ఇప్పుడు పాలన అంటే పథకాల ప్రకటనలు.. హామీల వర్షం.. ఆర్భాటపు కార్యక్రమాలు.. అమలులో మాత్రం అంతులేని జాప్యం అన్న విమర్శలు బలపడుతున్నాయి. ఒకవైపు మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పేరుతో వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం వెచ్చిస్తున్నది. మరోవైపు ఆర్టీసీ ఉద్యోగుల చిరకాల డిమాండ్ అయిన ప్రభుత్వంలో విలీనానికి సంబంధించిన ప్రక్రియ మాత్రం ఇంకా పూర్తి స్థాయిలో కొలిక్కి రాలేదు. ఇదేనా ప్రజాపాలన? మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం తప్పు కాదు.

# ఆర్టీసీ బస్సు.. ఆగిన విలీనం!




ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి రావడం, ఉద్యోగాలు--విద్య--వైద్యం కోసం వారి ప్రయాణ భారం తగ్గడం సామాజికంగా ఉపయోగకరమే. కానీ ఒక సంక్షేమ పథకం నిజంగా విజయవంతం కావాలంటే దాని ఆర్థిక భారం, ప్రజా రవాణా సంస్థ స్థిరత్వం, ప్రయాణికులకు అందుతున్న సేవల నాణ్యత అన్నింటినీ సమగ్రంగా చూడాలి. ప్రభుత్వం స్వయంగా మహిళల ఉచిత ప్రయాణ పథకం కింద ఆర్టీసీకి రూ.10 వేల కోట్లకు పైగా చెల్లించినట్లు 2026లో ప్రకటించింది. మరో సందర్భంలో రూ.10,700 కోట్లను ఉచిత ప్రయాణానికి సంబంధించిన మొత్తంగా పేర్కొంది. ఈ స్థాయిలో ప్రజాధనం వెచ్చిస్తున్నప్పుడు సహజంగానే ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఉచిత ప్రయాణం కొనసాగించడమే ప్రభుత్వానికి ప్రాధాన్యమా? లేక ఆర్టీసీని శాశ్వతంగా బలోపేతం చేయడమా? ఆర్టీసీ అనేది కేవలం బస్సులు నడిపే సంస్థ కాదు. లక్షలాది మంది రోజువారీ జీవనానికి ఆధారం. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు, విద్యార్థులకు, ఉద్యోగులకు, వృద్ధులకు అది ప్రాణాధారం. అలాంటి సంస్థ ఆర్థికంగా బలహీనపడితే చివరకు దాని ప్రభావం ప్రజలపైనే పడుతుంది. అందుకే ఉచిత ప్రయాణ పథకంతో పాటు ఆర్టీసీకి శాశ్వత ఆర్థిక నమూనా రూపొందించాలి. ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తాలను సమయానికి చెల్లించాలి. కొత్త బస్సులు, సిబ్బంది, డిపోలు, నిర్వహణ, కార్మికుల వేతనాలు, పదోన్నతులు, పదవీ విరమణ ప్రయోజనాలు అన్నింటినీ సమగ్రంగా పరిష్కరించాలి. ఇక్కడే ఆర్టీసీ విలీనం ప్రశ్న కీలకంగా మారుతుంది. 2023లోనే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ సేవల్లోకి తీసుకునే చట్టం అమలులోకి వచ్చింది. అయితే 2026లోనూ ప్రభుత్వం ఉద్యోగ సంఘాల గుర్తింపు, తదుపరి చర్యలు, విలీనానికి సంబంధించిన ప్రక్రియపై చర్చలు కొనసాగిస్తోంది. మేలో ముఖ్యమంత్రి స్వయంగా సంఘాలన్నీ సమావేశమై విలీనంపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జూన్‌లో రవాణా మంత్రి కూడా గుర్తింపు సంఘం ఎన్నికల అనంతరం విలీన ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. అంటే చట్టం వచ్చినా పూర్తి స్థాయి పరిపాలనా స్పష్టత ఎందుకు రాలేదన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఉచిత ప్రయాణం విషయంలో మాత్రం ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంది. మహిళా సంఘాలకు బస్సులు అప్పగించే కార్యక్రమాలు కూడా వేగంగా జరుగుతున్నాయి. 2026 జూన్‌లోనే 553 మహిళా సంఘాల బస్సులను ఆర్టీసీ నిర్వహణకు అప్పగించగా, మరో 3,000 బస్సులను కూడా మహిళా సంఘాల ద్వారా అద్దె ప్రాతిపదికన ఆర్టీసీకి అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడ కూడా ప్రశ్న మహిళల గురించి కాదు.. ప్రభుత్వ విధాన ప్రాధాన్యతల గురించి. ఒకవైపు ఆర్టీసీకి వేల కోట్ల రూపాయల భారం పెరుగుతున్న సమయంలో మరోవైపు కొత్త బాధ్యతలు, కొత్త నమూనాలు తీసుకురావడం ఎంతవరకు ఆర్థికంగా స్థిరమైన విధానం? మహిళా సాధికారత పేరుతో ప్రతి పథకాన్ని ప్రకటించడం సులభమే. కానీ ఆ పథకాలన్నీ ఐదేళ్లు, పదేళ్లు కొనసాగించగల ఆర్థిక సామర్థ్యం ప్రభుత్వానికి ఉందా? అన్నదే అసలు ప్రశ్న. ప్రజలకు ఉచితాలు ఇవ్వడం ద్వారా రాజకీయ లాభం వెంటనే రావచ్చు. కానీ ప్రజా సంస్థలను బలహీనపరిచి, ఉద్యోగుల సమస్యలను వాయిదా వేసి, చివరికి అదే ప్రజా సంస్థను ప్రజల ముందే నష్టాల్లో ఉందని చూపించడం మాత్రం పాలనా వైఫల్యం అవుతుంది. ఆర్టీసీకి కావాల్సింది రాజకీయ ప్రకటనలు కాదు.. శాశ్వత పరిష్కారం. మహిళలకు ఉచిత ప్రయాణం కావాలంటే దానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు ఉండాలి. ఆర్టీసీకి చెల్లించాల్సిన ప్రతీ రూపాయి సమయానికి చేరాలి. ఉద్యోగుల భద్రతకు స్పష్టమైన విధానం ఉండాలి. సంస్థ ఆదాయాన్ని పెంచే మార్గాలు అన్వేషించాలి. ప్రజలకు మెరుగైన బస్సు సేవలు అందాలి. సంక్షేమం అంటే ఖజానాను ఖాళీ చేయడం కాదు. సంక్షేమం అంటే ప్రజల డబ్బును ప్రజల భవిష్యత్తుకు ఉపయోగపడేలా ఖర్చు చేయడం. తెలంగాణ ప్రజలు ఉచిత ప్రయాణాన్ని వ్యతిరేకించడం లేదు. కానీ ఉచిత ప్రయాణం వెనుక ఆర్టీసీ భవిష్యత్తు బలహీనపడకూడదని కోరుతున్నారు. ఉద్యోగుల హక్కులు, సంస్థ మనుగడ, ప్రయాణికుల సౌకర్యాలు, ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ.. ఇవన్నీ సమానంగా ముఖ్యమే. ప్రచారానికి పథకాలు ఉండొచ్చు. కానీ పాలనకు ప్రాధాన్యతల క్రమం ఉండాలి. మహిళలకు ఉచిత బస్సు ఇచ్చామని చెప్పుకోవడం కంటే.. ఆ బస్సు నడిపే సంస్థను శాశ్వతంగా బలోపేతం చేశామని చెప్పుకునే స్థాయికి ప్రభుత్వం రావాలి. చట్టాలు చేసి ఆగిపోకుండా వాటిని సంపూర్ణంగా అమలు చేయాలి. హామీలు ఇచ్చి కాలం గడపకుండా కార్యాచరణ ప్రకటించాలి. లేకపోతే ప్రజలు అడిగే ప్రశ్న ఒక్కటే.. ఉచిత ప్రయాణానికి వేల కోట్లు ఉన్నప్పుడు.. ఆర్టీసీ ఉద్యోగుల భవిష్యత్తుకు స్పష్టమైన పరిష్కారం ఎందుకు లేదు?

ఇది మహిళలపై ప్రశ్న కాదు.
ఇది ఆర్టీసీపై ప్రశ్న కాదు.
ఇది ప్రభుత్వ పాలనా ప్రాధాన్యాలపై ప్రశ్న.

-విజయ్ నేలంటి, నల్లగొండ జిల్లా


**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
‘ప్రజావాణి’ వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి ‘ఈవార్తలు’ పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.